# ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

MHR TV

మెదక్ | సంపుటి: 19 సంచిక : 61 | సోమవారం 03, నవంబర్ 2025 | పేజీలు: 06 | వెల: రూ.1

Circulated By: Hyderabad-Medak-Sangareddy-Nalgonda-Warangal-Nizamabad-Adilabad -Vijayawada-Guntur-Vizag-Kurnool | www.prajaswaramdaily.com




జూబ్లీహిల్స్ ప్రచారంలో మాట్లడుతున్న సీఎం రేవంత్ రెడ్డి (ఫైల్)

# జూబ్లీహిల్స్‌లో హస్తం గాలి

## బీఆర్ఎస్‌పై తగ్గని వ్యతిరేకత

బెడిసికొడుతున్న కేటీఆర్ ప్రచారం
బస్తీ వాసుల్లో నవీన్ యాదవ్‌కు క్రేజ్
బీఆర్ఎస్ అభ్యర్థిపై సానుభూతి అంతంతే..
పథకాల అమలు కాంగ్రెస్ పార్టీకి అనుకూలం



హైదరాబాద్, ప్రజాస్వరం :

జూబ్లీహిల్స్ ఉపఎన్నికపై రాష్ట్రవ్యాప్తంగా రాజకీయ వాతావరణం వేడెక్కుతోంది. బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ మధ్య తీవ్ర పోటీ నెలకొన్నా, తాజా పరిణామాలు కాంగ్రెస్ పార్టీ పక్షాన గాలి వీచుతోందని సూచిస్తున్నాయి. ముఖ్యంగా బస్తీప్రాంతాల ప్రజలు ఈసారి కాంగ్రెస్ వైపు మొగ్గు చూపుతున్నారని రాజకీయ విశ్లేషకులు విశ్వసిస్తున్నారు.

**బస్తీలే ఓట్లు హస్తం పార్టీకేనా?**

జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో దాదాపు 70 శాతం ఓటర్లు బస్తీప్రాంతాలకు చెందినవారు. గత ఎన్నికల్లో వీరిలో గణనీయమైన మద్దతు బీఆర్ఎస్‌కి దక్కింది. కానీ ఈసారి పరిస్థితులు మారి పోయాయి. బస్తీప్రజలకు వాగ్దానం చేసిన డబుల్ బెడ్రూం ఇళ్లు ఇంకా చాలా చోట్ల అందలేదు. తాగునీటి కొరత, డ్రైనేజీ సమస్యలు, రోడ్ల దుస్థితి, స్థానిక నేతల అహంకార ధోరణి ప్రజల్లో అసంతృప్తిని పెంచాయి. ఈ పరిస్థితుల్లో కాంగ్రెస్ నాయకులు మిగతా 2లో

# ఎన్నికల ముందే మోడీ వరాలు

ఆ తర్వాత మర్చిపోతారు
ప్రజలను మభ్యపెట్టడం ప్రధానికి అలవాటే
కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ



హైదరాబాద్, ప్రజాస్వరం :

కాంగ్రెస్ అగ్రనేత, పార్లమెంట్ సభ్యుడు రాహుల్ గాంధీ మరోసారి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీపై తీవ్ర విమర్శలు చేశారు. ఆదివారం బిహార్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో పాల్గొన్న ఆయన, ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన వ్యాఖ్యలు అక్కడి రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమయ్యాయి.రాహుల్ గాంధీ మాట్లాడుతూ, ప్రధాని మోదీకి ఎన్నికలంటే ఓట్ల సీజన్ లాగా మారిపోయిందన్నారు. ప్రతి ఎన్నికల ముందు బిహార్ ప్రజలకు హామీలు ఇవ్వడం అలవాటేనని పేర్కొన్నారు. కానీ ఎన్నికలు ముగిసిన వెంటనే ఈ రాష్ట్రం వైపు కన్నెత్తి కూడా చూడరని ఆయన విమర్శించారు. బిహార్ రాష్ట్ర ప్రజలు ఎన్నో దశాబ్దాలుగా వెనుకబడి మిగతా 2లో



# కానిస్టేబుల్‌పై గురుకుల విద్యార్థినుల దాడి

షాద్‌నగర్‌లో ఉద్రిక్త పరిస్థితి
ప్రిన్సిపాల్ వేధిస్తున్నారంటూ విద్యార్థినుల ఆందోళనలు
అదుపు చేసేందుకు ప్రయత్నించిన కానిస్టేబుల్
అడ్డుకున్న విద్యార్థినులు దాడి



హైదరాబాద్, ప్రజాస్వరం :

రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌లో ఆదివారం ఉదయం ఉద్రిక్తత చోటు చేసుకుంది. స్థానిక ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాల విద్యార్థినులు అకస్మాత్తుగా రోడ్డెక్కి ధర్నాకు దిగారు. కళాశాల ప్రిన్సిపల్ అక్రమాలు, వేధింపులు, అన్యాయాలపై తీవ్ర ఆరోపణలు చేస్తూ పట్టణంలోని ప్రధాన చౌరస్తాలో ఆందోళన చేపట్టారు. నినాదాలతో ఆకాశం మోగించారు.

**ప్రిన్సిపాల్ వేధింపులు నిజమేనా?**

విద్యార్థినులు తమకు మిగతా 3లో

# బీఆర్ఎస్ కార్యాలయంపై కాంగ్రెస్ కార్యకర్తల దాడి

మణుగూరులో టెన్షన్ వాతావరణం
అక్రమనిర్మాణమంటూ కాంగ్రెస్ ఆరోపణ



హైదరాబాద్, ప్రజాస్వరం:

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరులో ఆదివారం ఉదయం రాజకీయ ఉద్రిక్తత తలెత్తింది. స్థానిక భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్టీ కార్యాలయంపై కాంగ్రెస్ కార్యకర్తలు దాడికి దిగడంతో పట్టణంలో ఆందోళన వాతావరణం నెలకొంది. రెండు వర్గాల మధ్య వాగ్వాదాలు, నినాదాలు, తల్లడిల్లిన పోలీసు వ్యవస్థ - ఈ పరిణామాలతో ప్రాంతం ఒక్కసారిగా కుదిపేసింది. సాక్షుల సమాచారం ప్రకారం - కాంగ్రెస్ కార్యకర్తలు పెద్ద ఎత్తున బీఆర్ఎస్ కార్యాలయం వద్దకు మిగతా 3లో



# కాశీబుగ్గ మృతుల కుటుంబాలకు పరిహారం అందజేత

ఒక్కో కుటుంబానికి రూ.15 లక్షల చొప్పున
భవిష్యత్తులో తగిన భద్రతా చర్యలు తీసుకుంటాం

అమరావతి, ప్రజాస్వరం :

శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో జరిగిన విషాద ఘటన రాష్ట్రాన్ని కుదిపేసింది. కార్తిక మాసం ఉత్థాన ఏకాదశి సందర్భంగా భక్తుల రద్దీ పెరగడంతో జరిగిన తొక్కిసలాటలో 9 మంది భక్తులు మిగతా 2లో

# ఢిల్లీలో తీవ్రస్థాయికి వాయుకాలుష్యం

ప్రభుత్వాలు ఏం చేస్తున్నాయి
గాలి నాణ్యత సూచి 400 దాటిపోయింది
కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీ వ్యాఖ్యలు



హైదరాబాద్, ప్రజాస్వరం:

దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం పరిస్థితి రోజురోజుకీ విషమిస్తోంది. ప్రతి సంవత్సరం శీతాకాలం మొదలయ్యే సమయానికల్లా గాలి నాణ్యత ప్రమాదకర స్థాయికి చేరడం సాధారణ విషయమే అయినా.. ఈసారి పరిస్థితి మరింతగా దారుణమైందని నిపుణులు చెబుతున్నారు. కొన్ని రోజులుగా గాలి నాణ్యత సూచీ మిగతా 3లో

# పెద్దలకో న్యాయం, పేదలకో న్యాయమా?

హైడ్రా బుల్డోజర్లు పేదల ఇండ్లనే కూలుస్తాయా?
మంత్రుల ఇండ్లు ఎందుకు కూల్చడం లేదు
హైడ్రా ప్రతీకార చర్యలకు పాల్పడుతోంది
బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
తెలంగాణ భవన్ లో పవర్ పాయింట్ ప్రజెంటేషన్



హైదరాబాద్, ప్రజాస్వరం:

తెలంగాణలో హైడ్రా చర్యలు పూర్తిగా వివక్షతతో, రాజకీయ ప్రతీకారంతో సాగుతున్నాయని భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) కార్యనిర్వాహక అధ్యక్షుడు కల్వకుంట్ల తారకరామారావు (కేటీఆర్) తీవ్రంగా విమర్శించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆదివారం ఆయన పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చి, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాన్ని, ముఖ్యంగా హైడ్రా చర్యలను ధ్వంసకర పాలనగా అభివర్ణించారు. కేటీఆర్ మాట్లాడుతూ, "న్యాయపరమైన చర్యల పేరుతో హైడ్రా అధికారులు పెద్దల ఇళ్లను వదిలి, పేదల ఇళ్లను బుల్డోజర్లతో కూల్చేస్తున్నారు. ఇది పూర్తిగా రాజకీయ పక్షపాతం. ఒకవైపు పెద్దల భవంతులు, ఫామ్‌హౌస్‌లు, చెరువుల్లో కట్టిన విల్లాలు సురక్షితంగా ఉండగా, మరోవైపు మిగతా 2లో



# సర్వేల టెన్షన్

సర్వశక్తులు ఒడ్డుతున్న కాంగ్రెస్
బీఆర్ఎస్ ముందంజలో ఉందన్న కొన్ని సర్వేలు
వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నా హస్తం పార్టీ
బూత్ స్థాయిలో ఓటర్లను ఆకర్షిస్తున్న నేతలు

03



# ఎన్నికల ముందే మోడీ వరాలు

మొదటిపేజీ తరువాయి

ఉన్నారని, నిరుద్యోగం, పేదరికం, వలసలు వంటి సమస్యలు ఇప్పటికీ పరిష్కారం కాని స్థితిలోనే ఉన్నాయని ఆయన అన్నారు. బిహార్ యువత దేశ భవిష్యత్తు అని, కానీ ప్రధాని మోదీ వారికి ఉద్యోగాల బదులు రీల్స్ చూపుతున్నారని రాహుల్ విమర్శించారు. సోషల్ మీడియాలో సమయం వృథా చేసుకోమని ప్రోత్సహిస్తూ, అసలు నిరుద్యోగంపై చర్చించే ధైర్యం లేదని ఆయన అన్నారు. మోదీ ప్రభుత్వం యువత సమస్యలను పరిష్కరించకుండా, కొత్త కొత్త ప్రచారాలతో వారి దృష్టిని మళ్లించే ప్రయత్నం చేస్తోందని రాహుల్ అభిప్రాయపడ్డారు.

రాహుల్ గాంధీ మాట్లాడుతూ, బిహార్‌లో ఇండియా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే రాష్ట్ర ప్రజల జీవితాలు మారతాయని హామీ ఇచ్చారు. ఆయన ప్రకారం, ప్రభుత్వం వచ్చిన రోజు నుండి విద్య, ఆరోగ్యం, ఉపాధి రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకువస్తామని, ప్రతి యువకుడికి గౌరవప్రదమైన ఉద్యోగం, ప్రతి కుటుంబానికి స్థిరమైన ఆదాయం కల్పించడమే లక్ష్యమని చెప్పారు. అలాగే ఆయన కేంద్ర రాజకీయాలపై కూడా పరోక్షంగా మోదీని ఎండగట్టారు. భారత్‌పాక్ సరిహద్దుల్లో ఉద్రిక్తతలు నెలకొన్నప్పుడు అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన జోక్యంతో ఘర్షణలు ఆపానని చెప్పినప్పుడు మోదీ స్పందించలేదని అన్నారు. దేశ గౌరవానికి, సార్వభౌమత్వానికి విరుద్ధంగా ఉన్న ఈ ప్రకటనపై ప్రధాని నోరు విప్పకపోవడం సిగ్గుచేటని రాహుల్ వ్యాఖ్యానించారు. ఇంకా ఆయన మాట్లాడుతూ, నోట్ల రద్దు, జీఎస్టీ వంటి నిర్ణయాలు దేశంలోని సాధారణ ప్రజలకే భారమయ్యాయని అన్నారు. చిన్న వ్యాపారులు, హస్తకళాకారులు, రైతులు వీటి కారణంగా నష్టపోయారని, కానీ కొంతమంది పెద్ద వ్యాపారవేత్తలు మాత్రం ఈ నిర్ణయాల వల్ల లాభపడ్డారని రాహుల్ అన్నారు. అదే మోదీ పాలన యొక్క అసలు స్వరూపమని ఆయన విమర్శించారు.

భారత్ ఆర్థిక వ్యవస్థను మళ్లీ ప్రజల చేతుల్లోకి తేవాలని, బిహార్ నుంచి దేశ పునరుద్ధరణ ప్రారంభమవుతుందని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. ఆయన ప్రకటించిన హామీల్లో ముఖ్యంగా 'మేడ్ ఇన్ బిహార్' అనే కార్యక్రమం ప్రాధాన్యం సంతరించుకుంది. ఆయన చెప్పారు — మేడ్ ఇన్ ఇండియా అని చెప్పడం కంటే, ప్రతి రాష్ట్రం తన సత్తాను చూపే సమయం వచ్చిందని. మేము బిహార్‌లో మొబైల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, కార్లు, యంత్రాలు 'మేడ్ ఇన్ బిహార్' అని చూడాలనుకుంటున్నామని రాహుల్ గాంధీ అన్నారు.అంతేకాకుండా, కేంద్రంలో ఇండియా కూటమి అధికారంలోకి వస్తే ప్రఖ్యాత నలంద విశ్వవిద్యాలయాన్ని తిరిగి బిహార్‌లో అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఇది కేవలం విద్యాసంస్థ మాత్రమే కాదు, బిహార్ గౌరవానికి ప్రతీక అవుతుందని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. రాహుల్ ప్రసంగం మొత్తం యువత,రైతులు,దళితులు,బలహీన వర్గాల సమస్యల చుట్టూనే తిరిగింది. ఆయన చెప్పిన ప్రతి మాటలో కేంద్ర ప్రభుత్వ విధానాల పై వ్యతిరేకత స్పష్టంగా కనిపించింది. చివరిగా ప్రజలను ఉద్దేశించి రాహుల్ గాంధీ, ఇప్పుడు బిహార్ మార్పు కోరుతోందని, ఆ మార్పు బిహార్ నుంచి మొదలైతే దేశం మొత్తం మారుతుందని అన్నారు. మీ ఓటు మీ భవిష్యత్తు నిర్ణయిస్తుంది అని పిలుపునిచ్చారు. ఈ ప్రసంగంతో బిహార్ రాజకీయాలు మరింత వేడెక్కాయి. రాహుల్ వ్యాఖ్యలపై బీజేపీ నాయకులు కౌంటర్ ఇచ్చే అవకాశముంది. ఎన్నికల వేళలో ఈ వ్యాఖ్యలు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి.

# జూబ్లీహిల్స్‌లో హస్తం గాలి

మొదటిపేజీ తరువాయి

ప్రజలతో నేరుగా కలవడం, వారి సమస్యలను వినడం ఓటర్ల మనసు గెలుచుకుంటోంది.

**ప్రజలతో మమేకమవుతున్న అభ్యర్థి**

కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ ప్రచారం ప్రతి చోటా ఉత్సాహాన్ని రేపుతోంది. బస్తీల్లో ఆయన అడుగు పెట్టిన ప్రతి చోట ప్రజలు స్వాగతం పలుకుతున్నారు. ప్రజల మధ్య ఆయన సింపుల్ నడవడి, స్థానిక సమస్యలపై స్పష్టమైన అవగాహన, ప్రజా అనుభూతితో మాట్లాడే తీరూ ఆకట్టుకుంటున్నాయి. "మా సమస్యలు వినేది ఆయనే," అని చెప్పే ఓటర్ల స్వరాలు బస్తీల్లో గట్టిగా వినిపిస్తున్నాయి. గతంలో బీఆర్ఎస్ నేతలు ఇచ్చిన హామీలు అమలు కాలేదన్న నిరాశ ప్రజల్లో స్పష్టంగా కనిపిస్తోంది.

**బీఆర్ఎస్ తప్పుడు ప్రచారానికి ప్రజలలో విసుగు**

ఎన్నికల వేళ బీఆర్ఎస్ సోషల్ మీడియా ద్వారా, సమావేశాల ద్వారా కాంగ్రెస్‌పై తీవ్రమైన విమర్శలు చేస్తోంది. "కాంగ్రెస్ గెలిస్తే సబ్సిడీలు ఆగిపోతాయి", "ప్రజా సేవలు నిలుస్తాయి" అంటూ భయాందోళనలు సృష్టించేందుకు ప్రయత్నిస్తోంది. అయితే ఈసారి ప్రజలు ఈ ప్రచారాన్ని పట్టించుకోవడం లేదు. "మేము చూసినది మాకు తెలుసు, విన్న మాటలకే ఓటు వేయం" అని ప్రజలు స్పష్టంగా చెబుతున్నారు. కాంగ్రెస్ నాయకులు సోషల్ మీడియాలో సమర్థవంతంగా ప్రతిస్పందిస్తూ బీఆర్ఎస్ ఆరోపణలను తిప్పికొడుతున్నారు. ఈ ప్రత్యామ్నాయ ప్రచారం కూడా కాంగ్రెస్ జోష్ పెంచుతోంది.



**మహిళల విశ్వాసం కాంగ్రెస్ వైపు**

బస్తీలలో మహిళా ఓటర్ల మద్దతు ఈ ఎన్నికల్లో కీలకమవుతుందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. గృహిణీలు, స్వయం సహాయక సంఘాల మహిళలు ఈసారి కాంగ్రెస్ పట్ల స్పష్టమైన అనుకూలత చూపిస్తున్నారు. ఇంటి వద్దకే వెళ్లి వారి సమస్యలను అడగడం, తాగునీటి సౌకర్యం, పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాల మెరుగుదలపై హామీలు ఇవ్వడం - ఈ అంశాలు మహిళల హృదయాలను తాకాయి. "ఇప్పటి వరకు ఎవ్వరూ అడగని ప్రశ్నలు అడుగుతున్నాడు నవీన్ యాదవ్. అందుకే ఈసారి ఓటు కాంగ్రెస్‌కే" అని చెప్పే మహిళల సంఖ్య ఎక్కువగానే ఉంది.

**యువతలో కాంగ్రెస్‌కి జోష్**

జూబ్లీహిల్స్‌లో పెద్ద ఎత్తున యువత ఉంది. ఐటీ, సర్వీస్ రంగాల్లో పనిచేసేవారితో పాటు నిరుద్యోగుల సంఖ్య కూడా ఎక్కువ. బీఆర్ఎస్ ప్రభుత్వం పదే పదే ఉద్యోగ నోటిఫికేషన్లు ఇస్తానని చెప్పి పూర్తి చేయకపోవడం యువతలో అసంతృప్తి కలిగించింది. కాంగ్రెస్ మాత్రం ఈ అంశంపై స్పష్టమైన రోడ్‌మ్యాప్ చూపిస్తోంది. నవీన్ యాదవ్ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండి యువతతో నేరుగా మాట్లాడడం, సమస్యలను వినడం కూడా యువత మద్దతు పెంచుతోంది.

**జూబ్లీహిల్స్ ప్రతిష్ఠాత్మకం**

ఈ ఉపఎన్నిక రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. హైదరాబాద్ నగర గుండెకాయలో ఉన్న ఈ నియోజకవర్గం, ధనిక వర్గాలు, మధ్యతరగతి, బస్తీప్రజల మిశ్రమ సమూహంగా ఉండటం వల్ల ప్రతీ పార్టీకి ఇది ప్రతిష్ఠాత్మక పోటీ. బీఆర్ఎస్ తన శక్తిమంతమైన కేడర్‌తో ఆత్మవిశ్వాసంగా ఉన్నా, ప్రజల్లో పెరిగిన విరక్తి పార్టీకి వెనుకడుగు వేయిస్తోంది. "మార్పు కావాలి" అనే భావజాలం బలంగా వినిపిస్తుండడంతో కాంగ్రెస్ బలపడుతోంది.

**బస్తీలే తీర్పు చెప్పబోతున్నాయి**

జూబ్లీహిల్స్‌లో బస్తీలే ఈ ఎన్నికల ఫలితాన్ని నిర్ణయించనున్నాయి. ఆ బస్తీలలోని ప్రజాభిప్రాయం ప్రస్తుతం కాంగ్రెస్‌కి అనుకూలంగా ఉందని స్పష్టమవుతోంది. బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం, గత పాలనలో నిలిచిపోయిన అభివృద్ధి, అహంకారపు తీరు - ఇవన్నీ కలిపి ప్రజలను కాంగ్రెస్ వైపు మళ్లించాయి. "ఇప్పుడు మార్పు కావాలి, నిజమైన ప్రజాపాలన కావాలి" అని బస్తీల్లో గట్టిగా వినిపిస్తున్నది. జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో కాంగ్రెస్ పార్టీ గెలుపు దిశగా సాగుతోందని చెప్పడం అతిశయోక్తి కాదు. బస్తీల మద్దతు పార్టీకి బలంగా మారింది. మధ్యతరగతి వర్గాల నుంచి కూడా సానుకూలత పెరుగుతోంది. బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం, విఫల పాలనతో ప్రజలు విసిగిపోయారు. ఇక ఈసారి "పాలనలో మార్పు - బస్తీలలో అభివృద్ధి" అనే ఆశతో ప్రజలు కాంగ్రెస్‌ను ఎంచుకునే సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. జూబ్లీహిల్స్‌లో మార్పు గాలి వీచుతోంది. ఆ గాలి తుఫానుగా మారి కాంగ్రెస్ జెండా ఎగరేయడం ఖాయమని స్థానిక రాజకీయ విశ్లేషకుల అంచనా.



# సీఎం దిష్టి బొమ్మ దహనానికి యత్నం

- **అడ్డుకున్న పోలీసులు**

**మెదక్ నవంబర్ 02 (ప్రజాస్వరం)**

జూబ్లీహిల్స్ ప్రచారంలో సీఎం రేవంత్ రెడ్డి ప్రధాని మోడీ ని సైనికులను అవమానించిన వ్యాఖ్యలను నిరసనగా మెదక్ పట్టణంలో రేవంత్ రెడ్డి దిష్టి బొమ్మ ను బీజేపీ నాయకులు దగ్ధం కార్యక్రమం కు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా రాందాస్ చౌరస్తా వద్ద సీఎం రేవంత్ రెడ్డి దిష్టి బొమ్మ ను దగ్ధం చేసే తరుణంలో బీజేపీ నాయకులను పోలీసులు అడ్డుకోవడం జరిగింది. దీంతో కొద్ది సేపు పరిస్థితి ఉద్రిక్తత నెలకొంది. ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా ప్రధాన కార్యదర్శిలు ఈర్ల రంజిత్ రెడ్డి, శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు నాయిని ప్రసాద్, మెదక్ జిల్లా ఉపాధ్యక్షుడు శంకర్ గౌడ్, రామాయంపేట మండలం అధ్యక్షుడు నవీన్ గౌడ్, పట్టణ ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, సీనియర్ నాయకులు సత్యం, సన్నీ, రాహుల్, బంటి, బబ్లు, ప్రేమ్ కుమార్ బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# కాశీబుగ్గ మృతుల కుటుంబాలకు పరిహారం అందజేత

మొదటిపేజీ తరువాయి

దుర్మరణం పాలవ్వగా, మరో 25 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఆదివారం ఉదయం కాశీబుగ్గకు వెళ్లిన కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు మృతుల కుటుంబాలను పరామర్శించారు. మృతుల కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి రూ.15 లక్షల చొప్పున ఆర్థిక సాయాన్ని అందజేశారు. బాధిత కుటుంబాలకు పూర్తి సహాయం అందిస్తామని వారు హామీ ఇచ్చారు. మంత్రులు అనంతరం మీడియాతో మాట్లాడారు. అచ్చెన్నాయుడు మాట్లాడుతూ ఈ ఘటన తనను తీవ్రంగా కలిచివేసిందని, ఇది ఎవరూ ఊహించని దుర్ఘటన అని అన్నారు. "భక్తుల ప్రాణాలు కోల్పోవడం బాధాకరం. వారి కుటుంబాలకు అండగా ప్రభుత్వం నిలుస్తుంది. భవిష్యత్తులో ఇలాంటి విషాదాలు జరగకుండా తగిన భద్రతా చర్యలు తీసుకుంటాం," అని తెలిపారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు మాట్లాడుతూ, కాశీబుగ్గ ఆలయం ప్రాంతంలో జనసంచారం ఎక్కువగా ఉంటుందని, పండుగల సమయంలో ప్రత్యేక నియంత్రణ చర్యలు అవసరమని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా సమగ్ర ప్రణాళిక రూపొందిస్తాయని చెప్పారు. శనివారం ఉదయం నుంచి కార్తిక ఏకాదశి పర్వదినం కావడంతో ఆలయం భక్తులతో కిటకిటలాడింది. స్వామి దర్శనానికి వేలాది మంది చేరుకున్నారు. ఉదయం 11.45 గంటల సమయంలో భక్తులు పెద్ద ఎత్తున గర్భగుడి వైపు ప్రవేశించే ప్రయత్నం చేయడంతో తోపులాట మొదలైంది. కొద్ది సేపటికే పరిస్థితి అదుపుతప్పి తొక్కిసలాటకు దారి తీసింది. సంఘటన స్థలంలోనే పలువురు కూలిపోయి ప్రాణాలు కోల్పోయారు.

వారిలో ఎనిమిది మంది మహిళలు, ఒక బాలుడు ఉన్నట్లు అధికారులు తెలిపారు. గాయపడిన వారిని తక్షణమే సమీప ఆసుపత్రులకు తరలించారు. కొంతమంది పరిస్థితి ఇంకా విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. ఘటన జరిగిన వెంటనే జిల్లా యంత్రాంగం, పోలీసులు, రెవెన్యూ సిబ్బంది, వైద్య బృందాలు సహాయక చర్యల్లో పాల్గొన్నాయి. ఆలయ పరిసరాల్లో రక్షణ చర్యలు చేపట్టి గాయపడిన వారికి తక్షణ వైద్య సహాయం అందించారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ ఘటనపై సమగ్ర విచారణకు ఆదేశించింది. స్థానికులు మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం కార్తిక మాసంలో భారీ రద్దీ ఉంటుందని, అయితే ఈసారి ఏర్పాట్లు తగినంతగా లేకపోవడం వల్లే ప్రమాదం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. భక్తుల ప్రవేశం, వెళ్లిపోయే మార్గాలు సరైన పద్ధతిలో లేకపోవడం, పోలీస్ నియంత్రణ తక్కువగా ఉండడం వలన తొక్కిసలాట జరిగింది అని వారు అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం కాశీబుగ్గ ప్రాంతం విషాద వాతావరణంలో మునిగిపోయింది. బాధిత కుటుంబాలు కన్నీరు మున్నీరవుతూ తమ బంధువుల అంత్యక్రియలకు సిద్ధమవుతున్నారు. ప్రభుత్వ పరామర్శ, ఆర్థిక సాయం కొంత ఉపశమనం కలిగించినా, కోల్పోయిన ప్రాణాలను ఎవరూ తిరిగి తెచ్చలేరు. ప్రజల ప్రాణాలు రక్షించడంలో భవిష్యత్తులో ప్రభుత్వం మరింత జాగ్రత్తలు తీసుకోవాలని స్థానిక భక్తులు, సామాజిక సంస్థలు కోరుతున్నాయి.

# పెద్దలకో న్యాయం, పేదలకో న్యాయమా?

మొదటిపేజీ తరువాయి

వందలాది పేదల కష్టార్జిత ఇళ్లు ఒకే రోజులో నేలమట్టం అవుతున్నాయి. ఈ ప్రభుత్వం 'పెద్దలకో న్యాయం - పేదలకో న్యాయం' అన్న నినాదంతో ముందుకెళ్తోంది," అని ఆయన మండిపడ్డారు.

**బీఆర్ఎస్ పాలనలో అభివృద్ధి, కాంగ్రెస్ పాలనలో కూల్చివేతలు**

కేటీఆర్ తన ప్రజెంటేషన్‌లో గత పది ఏళ్లలో కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. "మన పాలనలో రాష్ట్రం మౌలిక సదుపాయాల రంగంలో విప్లవాత్మక మార్పులు చూసింది. సచివాలయం, టీహబ్, వీహబ్, పోలీసు కమాండ్ కంట్రోల్ సెంటర్ వంటి ప్రతిష్ఠాత్మక నిర్మాణాలు సాకారం అయ్యాయి. హైదరాబాద్ ట్రాఫిక్ సమస్యలను తగ్గించేందుకు 42 ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు నిర్మించాం. 200 కిలోమీటర్లకుపైగా రోడ్లను విస్తరించాం. కానీ ఇప్పుడు ఈ అభివృద్ధిని కొనసాగించడం బదులు, కాంగ్రెస్ ప్రభుత్వం కూల్చివేతలతోనే పరిమితమైంది. వారి పాలనలో 'కనిపించే నిర్మాణం' ఒక్కటి లేదు. పేదల ఇళ్లనే లక్ష్యంగా చేసుకుంది," అని అన్నారు.

**మంత్రి పొంగులేటి, వివేక్, తిరుపతిరెడ్డి ఇళ్లపై ఎందుకు చర్యలు లేవు?**

హైడ్రా చర్యల్లో ద్వంద్వ వైఖరి బహిర్గతమవుతోందని కేటీఆర్ స్పష్టం చేశారు. "మంత్రి పొంగులేటి చెరువును పూడ్చి ఇల్లు కట్టుకున్నాడు. ఆయన ఇల్లు కూల్చే ధైర్యం హైడ్రాకు లేదా? మంత్రి వివేక్ ఇల్లు కూడా ఎఫ్‌టీఎల్ పరిధిలోనే ఉంది. ఆయన ఇల్లు కూల్చగలరా? సీఎం సోదరుడు తిరుపతిరెడ్డి ఇల్లు దుర్గం చెరువులోని ఎఫ్‌టీఎల్ ప్రాంతంలో ఉంది. ఆయన కోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకునేందుకు హైడ్రా సమయం ఇచ్చింది. కానీ పేదల ఇళ్లపై మాత్రం ఒక్కసారిగా బుల్డోజర్లు నడిపించారు. ఇది ఎలాంటి న్యాయం?" అని ప్రశ్నించారు. కేటీఆర్ మాట్లాడుతూ, "హైడ్రా




అధికారులు చట్టం అందరికీ సమానమని చెబుతున్నారు. కానీ ఆ సమానత్వం ఎక్కడ ఉంది? పెద్దలకి సమయం, అవకాశం, కోర్టు స్టే - పేదలకి బుల్డోజర్! ఇదే కాంగ్రెస్ ప్రభుత్వం నడిపిస్తున్న న్యాయం," అని విమర్శించారు.

**గాజులరామారంలో పేదలపై బుల్డోజర్లు**

కేటీఆర్ గాజులరామారంలో జరిగిన ఘటనను ఉదాహరణగా చూపించారు. "అదే ప్రాంతంలో కాంగ్రెస్ ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ స్థలం ఉంది. హైడ్రా అధికారులు అక్కడ అడుగుపెట్టలేదు. కానీ అదే గాజులరామారంలో పేదల ఇళ్లపై బుల్డోజర్లు, పోలీసులు, మునిసిపల్ బృందాలు ఒకేసారి దాడి చేశాయి. చిన్న పిల్లలు, వృద్ధులు, మహిళలు బయటకు రోడ్డుపైకి వచ్చి విలపించారు. ఎవరి విన్నా హృదయం కదిలేలా ఆ దృశ్యాలు ఉన్నాయి. ఆ పేదలు చట్టం ఉల్లంఘించలేదు, కేవలం బతుకుదెరువు కోసం కొంత భూమి మీద కట్టుకున్న ఇళ్లే. వాటిని కూల్చడం అనేది మానవత్వం లేని చర్య," అని ఆయన అన్నారు.

**కాంగ్రెస్ ప్రతీకార పాలన**

కేటీఆర్ మాట్లాడుతూ, "కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, మొదటినుంచి బీఆర్ఎస్ నేతలపై, కార్యకర్తలపై ప్రతీకార ధోరణితో వ్యవహరిస్తోంది. ఇప్పుడు ఆ కోపం పేదల మీద చూపిస్తోంది. తమ పార్టీని మద్దతు ఇచ్చిన ప్రజల ఇళ్లను కూల్చడం ద్వారా భయపెట్టే ప్రయత్నం చేస్తోంది. కానీ ప్రజలు ఇక మోసపోవడం లేదు. తెలంగాణ ప్రజలు పది సంవత్సరాలు కేసీఆర్ నాయకత్వంలో శాంతి, అభివృద్ధి, గౌరవం అనుభవించారు. ఇప్పుడు ఈ అవినీతిపరమైన పాలనకు తగిన గుణపాఠం చెప్పే సమయం దగ్గరలోనే ఉంది," అని హెచ్చరించారు.

**హైడ్రా నిబంధనలు, ఎంపిక ప్రకారం అమలు**

కేటీఆర్ మాట్లాడుతూ, "హైడ్రా నిబంధనలు పేపర్‌పై మాత్రమే ఉన్నాయి. వాటిని అధికారులు తమ సౌకర్యం, రాజకీయ ఒత్తిడి ఆధారంగా అమలు చేస్తున్నారు. ఒకే నిబంధనను పెద్దలకు వేరుగా, పేదలకు వేరుగా వాడుతున్నారు. చట్టం ముందు అందరూ సమానమనే మాట ఈ ప్రభుత్వంలో ఒక సరదా జోక్‌లా మారిపోయింది," అన్నారు. అంతేకాదు, ఆయన హైడ్రా చర్యల వల్ల వేలాది కుటుంబాలు రోడ్డునపడ్డాయని తెలిపారు. "పాఠశాలలు చదివే పిల్లలు, ఉద్యోగాలు చేసే మహిళలు, వృద్ధులు - అందరూ ఇళ్లు లేని పరిస్థితి ఎదుర్కొంటున్నారు. వీళ్లకు పునరావాసం ఇవ్వడం గానీ, ప్రత్యామ్నాయ స్థలాలు చూపించడం గానీ ప్రభుత్వం చేయలేదు. ఈ చర్యల వల్ల నగరంలో మానవ సంక్షోభం ఏర్పడింది," అని ఆయన పేర్కొన్నారు.

**ప్రజెంటేషన్‌లో ఫోటోలు, మ్యాప్‌లు**

కేటీఆర్ తన ప్రజెంటేషన్‌లో హైడ్రా ఇటీవల చేపట్టిన కూల్చివేతల ఫోటోలు, డ్రోన్ చిత్రాలు, మ్యాప్‌లు ప్రదర్శించారు. అందులో గాజులరామారం, మణికొండ, దుర్గం చెరువు పరిసర ప్రాంతాలు, మధాపూర్, గచ్చిబౌలి, మియాపూర్ ప్రాంతాల్లో జరిగిన కూల్చివేతలకు సంబంధించిన డేటా చూపించారు. "ఈ చిత్రాలు స్వయంగా చెబుతున్నాయి ఎవరి ఇళ్లు కూల్చబడ్డాయో, ఎవరి ఇళ్లు సురక్షితంగా ఉన్నాయో," అని ఆయన వ్యాఖ్యానించారు.

**ప్రజలే తీర్పు చెబుతారు**

కేటీఆర్ చివరగా మాట్లాడుతూ, "ఈ అన్యాయ పాలన ఎక్కువకాలం నిలవదు. పేదల కన్నీళ్లు వృథా కావు. ప్రజలు ఈ వివక్షను గమనిస్తున్నారు. త్వరలోనే వచ్చే ఎన్నికల్లో ప్రజలే కాంగ్రెస్‌కు తగిన తీర్పు చెబుతారు. బీఆర్ఎస్ మళ్లీ ప్రజల ఆశీర్వాదంతో అధికారంలోకి వచ్చి, ఇలాంటి అన్యాయానికి అడ్డుకట్ట వేస్తుంది," అని నమ్మకంగా చెప్పారు. కేటీఆర్ ప్రతి అంశాన్ని ఉదాహరణలతో వివరించారు. సభలో బీఆర్ఎస్ నాయకులు, మాజీ మేయర్లు, మాజీ ఎమ్మెల్యేలు, కార్యకర్తలు పాల్గొన్నారు. సభ చివర్లో హైడ్రా చర్యలపై బీఆర్ఎస్ చేపట్టనున్న నిరసన కార్యక్రమాలపై ఆయన సూచనలు ఇచ్చారు. కేటీఆర్ వ్యాఖ్యలు తెలంగాణలో హైడ్రా చర్యలపై పెరుగుతున్న అసంతృప్తిని ప్రతిబింబిస్తున్నాయి. పేదల ఇళ్ల కూల్చివేతలపై బీఆర్ఎస్ మరింతగా దూకుడుగా వ్యతిరేక స్వరం వినిపిస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ఈ చర్యలు చట్టబద్ధమైనవని చెబుతోంది. అయితే ప్రజల్లో దీనిపై చర్చ మొదలైంది — *నిజంగా హైడ్రా అందరికీ సమానంగా వ్యవహరిస్తుందా, లేక కేటీఆర్ చెప్పినట్టుగా పేదలపైనే కఠినంగా ఉంటుందా? అన్నది ఇప్పుడు ప్రధాన చర్చా అంశంగా మారింది.

# సర్వేల టెన్షన్



**హైదరాబాద్, ప్రజాస్వరం**

జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక రాష్ట్ర రాజకీయాల్లో మరోసారి చర్చనీయాంశంగా మారింది. ఈ ఎన్నికను ప్రతి పార్టీ ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటోంది. ముఖ్యంగా ఇటీవల విడుదలైన కేకే సర్వే ఫలితాలు రాజకీయ వాతావరణంలో కొత్త ఉత్కంఠను రేపాయి. ఆ సర్వే ప్రకారం భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) ముందంజలో ఉందని తేలడంతో కాంగ్రెస్ శిబిరంలో కదలికలు మొదలయ్యాయి. అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఈ పోరును కేవలం ఉప ఎన్నికగా కాకుండా ప్రజాభిప్రాయం పరీక్షగా తీసుకుంటోంది. అదే సమయంలో బీఆర్ఎస్ తమ కోటను నిలబెట్టుకోవడమే లక్ష్యంగా కదులుతోంది.

**కాంగ్రెస్‌లో కలకలం**

జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక మొదటి నుంచే కాంగ్రెస్‌కి అనుకూలంగా ఉంటుందని భావించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం పదవిలోకి వచ్చి దాదాపు ఏడాది పూర్తికాబోతున్న సమయంలో ఈ ఎన్నిక జరుగుతోంది. కాబట్టి ఈ పోరును కాంగ్రెస్ తమ పాలనకు లిట్మస్ టెస్ట్‌గా పరిగణిస్తోంది. కానీ కేకే సర్వేలో బీఆర్ఎస్ ముందంజలో ఉందన్న నివేదిక కాంగ్రెస్ వ్యూహకర్తలకు గట్టి షాక్‌గా మారింది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వయంగా జూబ్లీహిల్స్ నియోజకవర్గంపై దృష్టి సారించినట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. సర్వేలో సూచించిన బలహీన ప్రాంతాలను గుర్తించి వాటిపై ప్రత్యేక పర్యవేక్షణ చేయాలని ఆయన సూచించారు. డివిజన్ వారీగా, పోలింగ్ బూత్ వారీగా ఓటర్లను దగ్గరయ్యేలా వ్యూహాలు రూపొందించారు. ప్రతి ప్రాంతానికి ఇన్‌చార్జ్‌లను నియమించి, వారిపై నేరుగా పర్యవేక్షణ చేపట్టారు.

**బూత్ స్థాయి వ్యూహం**

కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు పూర్తిగా బూత్ స్థాయి వ్యూహంపై దృష్టి పెట్టింది. ఒక్కో బూత్‌లో 100-150 ఓటర్ల క్లస్టర్ ఆధారంగా వ్యక్తిగత పరిచయాలు, డోర్ టు డోర్ ప్రచారం, సామాజిక మాధ్యమాల ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది. పార్టీకి చెందిన కార్పొరేటర్లు, సీనియర్ కార్యకర్తలు ప్రతి కాలనీని చుట్టుముట్టేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ముఖ్యంగా మధ్యతరగతి ఓటర్లపై, మహిళా ఓటర్లపై ప్రత్యేక దృష్టి పెట్టారు. పట్టణ ప్రాంతాలలో ఈ రెండు వర్గాల ఓటు ప్రాధాన్యం ఎక్కువగా ఉంటుంది. ఈ కారణంగా ప్రభుత్వం చేపట్టిన గృహ పథకాలు, మహిళా స్వయం సహాయక సంఘాలకు ఇచ్చిన ప్రోత్సాహం, సబ్సిడీ స్కీమ్స్ వంటి అంశాలను ప్రచారంలో ప్రాధాన్యంగా చూపుతున్నారు.ఇక యువతను ఆకర్షించేందుకు "నూతన తెలంగాణ, నూతన అవకాశాలు" అనే నినాదంతో సైకిల్ ర్యాలీలు, కాఫీ మీట్లు, చర్చా వేదికలను నిర్వహిస్తున్నారు. యువతకు ఉద్యోగావకాశాలు, స్టార్టప్ ప్రోత్సాహం, డిజిటల్ పాలసీలు వంటి అంశాలను ముందుకు తెచ్చి ఓటు బ్యాంకును బలోపేతం చేయాలన్నది పార్టీ ఆలోచన.

**మీడియా మేనేజ్‌మెంట్, సోషల్ కనెక్ట్**

రేవంత్‌రెడ్డి ఈ ఎన్నికను తన ప్రభుత్వానికి ప్రజల మద్దతు ఎంత ఉందో అంచనా వేసే టెస్ట్‌గా పరిగణిస్తున్నారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అందుకే ఆయన ప్రచార పద్ధతుల్లో మార్పులు తీసుకువస్తున్నారు. రోజువారీగా ప్రచార రిపోర్టులు తీసుకుంటూ, ప్రతి రోజు మీడియా నేరేటివ్‌ను పరిశీలిస్తున్నారు. సోషల్ మీడియా విభాగాన్ని ప్రత్యేకంగా బలోపేతం చేశారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి సంబంధించి వందలాది వాలంటీర్లు డిజిటల్ ప్రచారంలో పాల్గొంటున్నారు. "రేవంత్ పాలనలో మార్పు వచ్చింది", "హైదరాబాద్ తిరిగి ప్రగతి పథంలోకి వచ్చింది" అనే పాజిటివ్ నేరేటివ్‌ను ప్రజల్లో నిలబెట్టే ప్రయత్నం చేస్తున్నారు.

**బీజేపీ సైలెంట్ గేమ్**

ఇక బీజేపీ మాత్రం సైలెంట్ గేమ్ ఆడుతోంది. గెలుపు అవకాశాలు తక్కువగానే ఉన్నప్పటికీ, విపక్ష ఓట్లు చీల్చడం ద్వారా కాంగ్రెస్‌కి దెబ్బ తీయాలన్న వ్యూహంతో ముందుకు వెళ్తోంది. బీజేపీ అభ్యర్థి పట్టణ ప్రాంతాలలో మధ్యతరగతి వర్గాల అసంతృప్తిని దృష్టిలో ఉంచుకుని ప్రచారం చేస్తున్నాడు. "రాష్ట్ర ప్రభుత్వంపై నిరాశ ఉన్నా, బీఆర్ఎస్‌కు ఓటు వేయడం అర్థరహితం" అనే వాదనను బలోపేతం చేయాలన్నది ఆ పార్టీ లక్ష్యం. సర్వే ఫలితాలు కాంగ్రెస్‌కి హెచ్చరికగా మారినా, పార్టీ దానిని అవకాశంగా మార్చుకునే ప్రయత్నం చేస్తోంది. "బీఆర్ఎస్ పాలనలో పెరిగిన అవినీతి, హైడ్రా వివాదం, అభివృద్ధి నిలిచిపోవడం" వంటి అంశాలను ప్రస్తావిస్తూ బీఆర్ఎస్‌పై ప్రజల్లో ప్రతికూలత సృష్టిస్తోంది. కాంగ్రెస్ నాయకులు "ప్రజల్లో మార్పు కోరుతున్న స్వరాలు వినిపిస్తున్నాయి. ఆ మార్పు కాంగ్రెస్‌ద్వారానే సాధ్యమని ప్రజలకు నమ్మకం కల్పించాలి" అని శ్రేణులను ప్రోత్సహిస్తున్నారు. పార్టీ అంతర్గతంగా కూడా విభేదాలు లేకుండా అన్ని వర్గాల నేతలను ఒకే వేదికపై నిలబెట్టే ప్రయత్నం జరుగుతోంది. మాజీ మేయర్లు, మాజీ కార్పొరేటర్లు, మహిళా నాయకులు, యూత్ వింగ్ ప్రతినిధులు ప్రచారంలో చురుకుగా పాల్గొనాలని ఆదేశాలు జారీ చేశారు.

**ప్రజాభిప్రాయం పరీక్షగా జూబ్లీహిల్స్**

ఈ ఉప ఎన్నిక ఫలితాలు మూడు ప్రధాన పార్టీలకు కూడా రాజకీయ పరంగా చాలా ప్రాధాన్యం సంతరించుకున్నాయి. బీఆర్ఎస్‌కి ఇది తమ బేస్ కాపాడుకునే పోరు కాగా, కాంగ్రెస్‌కి ఇది అధికారంలో ఉన్నప్పటికీ ప్రజల్లో నమ్మకం నిలబెట్టుకునే పరీక్ష. బీజేపీకి మాత్రం పట్టణ ఓటర్లలో తమ స్థితి అంచనా వేసే అవకాశం. కాంగ్రెస్ వ్యూహకర్తలు ఈ ఎన్నికలో కనీసం 5 నుండి 6 శాతం ఓటు షేర్ పెంచగలిగితే, రాబోయే గ్రేటర్ హైదరాబాద్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) ఎన్నికల్లో పెద్ద మార్పు తీసుకురావచ్చని అంచనా వేస్తున్నారు. అందుకే రేవంత్‌రెడ్డి జూబ్లీహిల్స్ పోరును "సిటీ ట్రయల్"గా పరిగణిస్తున్నారని విశ్వసనీయ వర్గాల సమాచారం. రాజకీయ విశ్లేషకులు చెబుతున్నట్లుగా, జూబ్లీహిల్స్ ఎన్నిక ఇప్పుడు తెలంగాణ రాజకీయ దిశను సూచించే లిట్మస్ టెస్ట్‌గా మారింది. పట్టణ ఓటర్లు ఏ పార్టీకి మద్దతు ఇస్తారన్న దానిపై ఆధారపడి రాబోయే ఎన్నికల సన్నివేశం రూపుదిద్దుకునే అవకాశం ఉంది. సర్వే ఫలితాల ప్రభావం ఎలాంటిదైనా, కాంగ్రెస్ శ్రేణుల్లో నూతన ఉత్సాహం కనిపిస్తోంది. బీఆర్ఎస్ తన బలాన్ని కాపాడుకునేందుకు శక్తివంచన లేకుండా శ్రమిస్తోంది. బీజేపీ సైలెంట్‌గా కానీ పద్ధతిగా ముందుకు వెళ్తోంది. ఏ పార్టీకి ఫలితం అనుకూలమైనా, జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఈసారి రాజకీయ సమతుల్యాన్ని మార్చే అవకాశం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

**బీఆర్ఎస్ ప్రతిస్పందన**

ఇదిలా ఉంటే బీఆర్ఎస్ కూడా ఈ ఎన్నికను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. జూబ్లీహిల్స్ నియోజకవర్గం గతంలో ఆ పార్టీకి బలమైన కోటగా నిలిచింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి గెలిచిన ఆధిక్యం గణనీయంగా ఉంది. కాబట్టి ఆ బలాన్ని నిలబెట్టుకోవడమే కాకుండా, "పట్టణ అభివృద్ధి అంటే కేటీఆర్ పాలన" అనే భావనను ప్రజల్లో బలపరచే ప్రయత్నం జరుగుతోంది. కేకే సర్వేలో ముందంజగా చూపించబడటం బీఆర్ఎస్ శ్రేణుల్లో ఉత్సాహాన్ని పెంచింది. పార్టీ సీనియర్ నేతలు వరుసగా సమీక్షలు నిర్వహిస్తూ, కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపుతున్నారు.

# ఢిల్లీలో తీవ్రస్థాయికి వాయుకాలుష్యం

**మొదటిపేజీ తరువాయి**



400 దాటిపోయి "తీవ్ర స్థాయి"లో నమోదవుతోంది. వాహనాల పొగలు, పంటల అవశేషాలు కాల్చడం, కట్టడాల ధూళి, దీపావళి పటాకుల ప్రభావం కలసి ఢిల్లీని మళ్లీ పొగచూరిన నగరంగా మార్చేశాయి.

**ప్రియాంక గాంధీ ఆందోళన**

ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు ప్రియాంక గాంధీ వాయు కాలుష్యంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. బిహార్‌లో ఎన్నికల ప్రచారం ముగించుకుని ఢిల్లీకి తిరిగి వచ్చిన ఆమె, అక్కడి గాలి నాణ్యతను స్వయంగా చూసి దిగ్భ్రాంతికి గురైనట్లు తెలిపారు. ఆమె సోషల్ మీడియా వేదికగా ప్రధాని నరేంద్ర మోదీ, ఢిల్లీ సీఎం రేఖా గుప్తాలను ట్యాగ్ చేస్తూ, "రాజకీయాలతో సంబంధం లేకుండా అందరూ కలసి ఈ సంక్షోభాన్ని ఎదుర్కోవాలి" అంటూ పిలుపునిచ్చారు. "ప్రతి సంవత్సరం ఢిల్లీ పౌరులు ఈ విష వాయువుల మధ్య జీవన యత్నం చేస్తున్నారు. చిన్నపిల్లలు, వృద్ధులు, రోగులు — అందరి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతోంది. ఇది కేవలం ఢిల్లీ సమస్య కాదు, జాతీయ సమస్యగా చూడాలి" అని ఆమె పేర్కొన్నారు. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు కలసి సమన్వయంతో తక్షణ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

**గాలి నాణ్యత క్షీణతకు కారణాలు**

గత రెండు వారాలుగా వాతావరణ పరిస్థితులు కూడా ఢిల్లీకి ప్రతికూలంగా మారాయి. ఉత్తర భారతదేశంలో గాలి వేగం చాలా తగ్గిపోవడం వల్ల వాయు కాలుష్య కణాలు వాతావరణంలోనే చిక్కుకుపోతున్నాయి. పంజాబ్, హరియాణా రాష్ట్రాల్లో పంటల అవశేషాలు కాల్చడం ఇంకా కొనసాగుతుండడంతో ఆ పొగ ఢిల్లీ వైపు చేరుతోంది. వాహనాల నుండి ఉద్గారాలు, పారిశ్రామిక కాలుష్యం, రోడ్డు నిర్మాణాల్లో ధూళి కలసి గాలి నాణ్యతను మరింత దిగజార్చుతున్నాయి.

కేంద్ర కాలుష్య నియంత్రణ బోర్డు తాజా నివేదిక ప్రకారం, ఆదివారం నాడు ఢిల్లీలోని ఆనంద్ విహార్, వజీర్పూర్, జహంగీర్‌పురి, బురారీ వంటి ప్రాంతాల్లో AQI 420-460 మధ్య నమోదైంది. ఈ స్థాయిలో గాలి ఉండటం వలన ఆరోగ్యవంతులకే కళ్ల మండడం, గొంతు నొప్పి, శ్వాసకోస ఇబ్బందులు ఎదురవుతాయి. శ్వాస సంబంధిత వ్యాధులతో బాధపడే వారికి మరింత ప్రమాదం ఏర్పడుతుంది.

**ప్రభుత్వ చర్యలు**

ఈ నేపథ్యంలో ఢిల్లీ ప్రభుత్వం పాఠశాలలు కొన్ని రోజులు మూసివేయాలని ఆలోచిస్తోంది. అవసరమైతే 'ఆడ్-ఈవెన్' వాహన విధానాన్ని మళ్లీ అమలు చేయవచ్చని సూచనలు వెలువడుతున్నాయి. అలాగే కేంద్ర ప్రభుత్వం కూడా జీఆర్‌ఏపీ (గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్) క్రింద కఠిన చర్యలు చేపట్టాలని ఆదేశించింది. ఇప్పటికే నగరంలో మసక కమ్మిన దృశ్యం ఏర్పడింది. ఉదయాన్నే దట్టమైన పొగమంచు, గాలిలో ధూళి, వాహనాల లైట్లు స్పష్టంగా కనిపించకపోవడం వంటి దృశ్యాలు సాధారణమైపోయాయి. ప్రజలు మాస్కులు లేకుండా బయటకు వెళ్లడానికే భయపడుతున్నారు.ప్రియాంక గాంధీ పిలుపు రాజకీయ సరిహద్దులు దాటి దేశ వ్యాప్తంగా చర్చకు దారితీస్తోంది. "ఇది రాజకీయ అంశం కాదు, మానవ హక్కుల సమస్య" అని ఆమె చెప్పిన వ్యాఖ్యలు ప్రజల్లో స్పందన రేపుతున్నాయి.

మొత్తం మీద, ఢిల్లీ మళ్లీ తన పాత దుస్థితికి చేరుకుంది. ఈసారి కూడా ప్రభుత్వాలు సమన్వయంతో తక్షణ చర్యలు చేపట్టకపోతే, పరిస్థితి మరింత విషమించే అవకాశముందని పర్యావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు.



# బీఆర్ఎస్ కార్యాలయంపై కాంగ్రెస్ కార్యకర్తల దాడి

**మొదటిపేజీ తరువాయి**

చేరుకున్నారు. కొద్ది సేపట్లోనే వారు కార్యాలయ గేటు వద్ద ఉన్న ఫ్లెక్సీలు, బ్యానర్లు చింపివేసి, లోపల ఉన్న ఫర్నిచర్‌కి నిప్పు పెట్టారు. కుర్చీలు, డెస్కులు, పార్టీ జెండాలు అగ్నికి ఆహుతయ్యాయి. కార్యాలయం పరిసరాల్లో దట్టమైన పొగ కమ్ముకుంది. ఆ సమయానికి అక్కడ ఉన్న బీఆర్ఎస్ కార్యకర్తలు ఆందోళనకు దిగారు. దీంతో రెండు వర్గాల మధ్య ఘర్షణ వాతావరణం ఏర్పడింది.

వెంటనే మణుగూరు పోలీసులు అక్కడికి చేరుకుని గట్టి భద్రత ఏర్పాటు చేశారు. పరిస్థితి అదుపులోకి తేలేదాకా భారీ బలగాలను మోహరించారు. ఇరు వర్గాల నాయకులను పోలీసులు సర్దిచెప్పే ప్రయత్నం చేశారు.

కాంగ్రెస్ నేతలు ప్రభుత్వ భూమిని ఆక్రమించి బీఆర్ఎస్ పార్టీ అక్రమంగా కార్యాలయం నిర్మించిందని తీవ్రంగా ఆరోపిస్తున్నారు. "ప్రజలకు చెందాల్సిన భూమిని పార్టీ అవసరాలకు వాడుకోవడం సరికాదు" అని వారంటున్నారు. ప్రజా ప్రయోజనాల కోసం ఉపయోగించాల్సిన స్థలాన్ని రాజకీయ పార్టీ స్వాధీనం చేసుకోవడం అన్యాయమని వ్యాఖ్యానించారు.

దీనికి ప్రతిస్పందనగా బీఆర్ఎస్ నాయకులు ఆరోపణలను ఖండించారు. "అన్నీ చట్టబద్ధంగానే జరిగాయి. రాజకీయ కక్షతో కాంగ్రెస్ కార్యకర్తలు హింసకు తెగబడ్డారు" అని వారు ఆరోపించారు. ప్రజల్లో మద్దతు తగ్గిపోతుండటంతో కాంగ్రెస్ ఇలాంటి చర్యలకు దిగుతోందని విమర్శించారు.

ఈ ఘటనతో మణుగూరు పట్టణంలో కొంతసేపు రవాణా అంతరాయం ఏర్పడింది. ఆసక్తిగా వీక్షించిన స్థానికులు పరిస్థితిని గమనిస్తూ ఆందోళన వ్యక్తం చేశారు. పోలీసులు అదుపు చర్యలు చేపట్టడంతో పరిస్థితి క్రమంగా సాధారణమైంది.

ఈ ఘటనపై జిల్లా పోలీసు అధికారి నివేదిక కోరారు. కార్యాలయానికి నిప్పు పెట్టిన అంశంపై వీడియో దృశ్యాలు, సాక్షుల వాంగ్మూలాల ఆధారంగా విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

మణుగూరులో జరిగిన ఈ సంఘటనతో తెలంగాణ రాజకీయ వాతావరణం మళ్లీ వేడెక్కింది. ముఖ్యంగా బీఆర్ఎస్-కాంగ్రెస్ మధ్య పెరుగుతున్న విభేదాలు జిల్లా స్థాయిలో కూడా తీవ్ర రూపం దాల్చుతున్నాయనే అభిప్రాయం రాజకీయ వర్గాల్లో వ్యక్తమవుతోంది.

# కానిస్టేబుల్‌పై గురుకుల విద్యార్థినుల దాడి

**మొదటిపేజీ తరువాయి**

న్యాయం కావాలని, ప్రిన్సిపల్ వ్యవహారశైలిపై విచారించాలని, వెంటనే ఆయనను పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ప్రిన్సిపల్ తీరుతో కళాశాలలో వాతావరణం భరించరానిదిగా మారిందని, విద్యార్థినుల గౌరవాన్ని కించపరుస్తున్నారని ఆరోపించారు. తాము పలుమార్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేసినా స్పందన రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

**రంగంలోకి పోలీసులు**

ఆందోళన వార్త తెలియడంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చే ప్రయత్నం చేశారు. అయితే విద్యార్థినులు వెనక్కు తగ్గకపోవడంతో ఉద్రిక్తత పెరిగింది. ఈ క్రమంలో ఓ మహిళా కానిస్టేబుల్ ఒక విద్యార్థినిపై చేయి చేసుకోవడంతో పరిస్థితి మరింత తీవ్రతరమైంది. దీనిపై ఆగ్రహించిన ఇతర విద్యార్థినులు ఆమెపై తిరగబడి నెట్టుకొచ్చారు. "న్యాయం కోసం వచ్చిన మమ్మల్నే కొడతారా?" అంటూ నినాదాలు చేస్తూ ఆందోళన కొనసాగించారు. ఘటన స్థలంలో కొంతసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. విద్యార్థినుల ఉత్సాహం, పోలీసుల గందరగోళం, స్థానికుల ఆసక్తి కలిసి అక్కడ పెద్ద సంఖ్యలో జనాన్ని సమీకరించాయి. ఎవరూ ఊహించని ఈ పరిస్థితికి క్షణాల్లోనే షాద్‌నగర్ చౌరస్తా కేంద్రంగా మారింది. విద్యార్థినులు జిల్లా కలెక్టర్ స్వయంగా వచ్చి తమ సమస్యలను వినేవరకు ఆందోళన విరమించేది లేదని స్పష్టంగా ప్రకటించారు. "మా వేదనను ఎవరూ పట్టించుకోవడం లేదు. మాకు రక్షణ ఎక్కడ?" అంటూ బాధతో రోదించారు. కొంతమంది విద్యార్థినులు బోర్డులు, ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. చివరికి పోలీసులు బలవంతంగా కొంతమంది విద్యార్థినులను వాహనాల్లో ఎక్కించి అక్కడి నుంచి



తరలించారు. దీంతో ఆందోళన తాత్కాలికంగా ముగిసినప్పటికీ, విద్యార్థినుల ఆవేదన మాత్రం తగ్గలేదు. ఈ ఘటనతో స్థానిక ప్రజల్లో కలకలం రేగింది. కళాశాల పరిపాలన, విద్యా శాఖ అధికారుల నిర్లక్ష్యం వల్లే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని పలువురు విమర్శించారు. స్థానిక మహిళా సంఘాలు, విద్యార్థి సంఘాలు కూడా ఈ ఘటనపై స్పందించాయి. విద్యార్థినులపై బలప్రయోగం చేయడం సరికాదని, పూర్తి స్థాయిలో విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు. షాద్‌నగర్‌లో చోటుచేసుకున్న ఈ ఘటన సామాజిక మాధ్యమాల్లో కూడా చర్చనీయాంశమవుతోంది. గురుకుల విద్యార్థినుల హక్కులు, రక్షణపై ప్రశ్నలు మళ్లీ లేవుతున్నాయి. అధికారులు తక్షణ చర్యలు తీసుకుంటేనే పరిస్థితి అదుపులోకి వస్తుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.





# మరోసారి కొత్త ఓటర్ల నమోదుకు ఈసీ ఆదేశాలు

**దౌల్తాబాద్ నవంబర్ 2 (ప్రజాస్వరం)**

స్థానిక సంస్థల ఎన్నికల కసరత్తులో భాగంగా గ్రామ పంచాయతీ వార్డుల వారీ ఓటర్ల జాబితాలో కొత్త ఓటర్లను మరోసారి నమోదు చేయాలని ఎస్ఈసీ శనివారం అన్ని జిల్లాల కలెక్టర్లను ఆదేశించింది. గత నెల 1వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండి, కేంద్ర ఎన్నికల సంఘం రూపొందించే శాసనసభ నియోజకవర్గాల ఓటర్ల జాబితాలో ఈ నెల 15 వరకు నమోదయ్యే గ్రామీణ ఓటర్లను 'స్థానిక' ఎన్నికల ఓటర్ల జాబితాలో చేర్చాలని సూచించింది. ఎన్నికలు వాయిదా పడినా, మళ్లీ నిర్వహించాల్సి వస్తే ముందు జాగ్రత్తగా ఈ చర్యలు తీసుకోవాలని నిర్ణయించింది.



# దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి సంతాపం

**దౌల్తాబాద్, నవంబర్ 2 (ప్రజాస్వరం):**

దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం మాజీ మంత్రివర్యులు, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు గారి తండ్రి కీర్తిశేషులు సత్యనారాయణ రావు ఇటీవల మరణించిన నేపథ్యంలో హరీష్ రావుని వారి హైదరాబాద్ నివాసంలో కలుసుకున్నారు. ఈ సందర్భంగా సత్యనారాయణ రావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు .ఈ కార్యక్రమంలో కొడకండ్ల శ్రీరామ శరణ్ శర్మ గురువుగారు, దొమ్మాట మాజీ సర్పంచులు కొమ్మేరా పూజిత వెంకట్ రెడ్డి, అప్పవారు శ్రీనివాస్, చిట్టాపూర్ రాజు, బిఆర్ఎస్ నాయకుడు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



# బీఆర్ఎస్ లో చేరిన కాంగ్రెస్ మాజీ కార్పొరేటర్

**జవహర్ నగర్ ,నవంబర్ 2, ప్రజాస్వరం:**

జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ 6వ డివిజన్ మాజీ కార్పొరేటర్ పల్లపు రవి పల్లపు రవి దాదాపు 300 మంది కాంగ్రెస్ కార్యకర్తలతో ఆదివారం మాజీ మంత్రి మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో వచ్చేరాడు ఈ సందర్భంగా మల్లారెడ్డి ఉప్పలపు రవికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. తెలంగాణ రాష్ట్రంలో తిరిగి బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని మల్లారెడ్డి అన్నారు. కార్యక్రమంలో జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు కొండలు ముదిరాజ్, మాజీ కార్పొరేటర్ అల్లూరి సంగీత రాజశేఖర్, జనరల్ సెక్రటరీ రెడ్డిశెట్టి మహేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్ధులు యాదవ్, జిట్ట శ్రీనివాస్ రెడ్డి, వెంకటేష్ గౌడ్, సాయి కుమార్, ప్రకాష్,రంగుల సతీష్, బండి నవీన్ గౌడ్ ,మహేందర్, తధితరులు పాల్గొన్నారు.







# ఏజెన్సీ గ్రామాలను తలపిస్తున్న డంపింగ్ యార్డ్ సమీప కాలనీలు

- **ఇళ్లలోకి వరద నీరు, లోపించిన పారిశుద్ధ్య పనులు ప్రబలుతున్న అంటువ్యాధులు**
- **బస్తీల్లో పర్యటించిన బిజెపి నాయకులు**

**జవహర్ నగర్, నవంబర్ 2, ప్రజాస్వరం:**

జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని డంపింగ్ యార్డ్ సమీపంలోని న్యూ దేవేందర్ నగర్, జయశంకర్ కాలనీ, కెసిఆర్ నగర్ కాలనీలో ఏజెన్సీ గ్రామాల కున్న గ్రామాల కన్నా అధ్వానంగా ఉన్నాయని బిజెపి నాయకులు ఆరోపించారు. ఆదివారం జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ బిజెపి అధ్యక్షుడు కర్లపూడి జోగారావు ఆధ్వర్యంలో బిజెపి నాయకులు ఆ ప్రాంతాలలో పర్యటించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర రాజధానికి చేరువలో జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న ఈ బస్తీలను కనీసం పట్టించుకునే నాథుడే లేదని వరద బీభత్సంతో ఇళ్లలోకి వరద నీరు చేరి అపరిశుభ్ర వాతావరణంతో తీవ్రమైన అంటువ్యాధులు ప్రబలుతున్న అధికారులు ప్రజాప్రతినిధులు ఎవరు అటువైపు చూసిన దాఖలా లేవని వారు ఆరోపించారు. ఓవైపు డంపింగ్ యార్డ్ కాలుష్యం మరోవైపు అపరిశుభ్ర వాతావరణంతో బస్తీలు అనేక అవస్థలు ఎదుర్కొంటున్నారన్నారుపదేళ్ల కెసిఆర్ పాలన, రెండేండ్ల ఇందిరమ్మ పాలన కలిపి 12 ఏళ్లలో ఈ కాలనీలు కనీస అభివృద్ధికి నోచుకోలేదన్నారు. సమస్యాత్మకమైన ప్రదేశాలను కనీసం పరిశీలించకుండా కుర్చీలకే పరిమితమైన అధికారులు ఇప్పటికైన కళ్ళు తెరిచి సమస్యలను పరిష్కరించకపోతే ప్రజా పాలనపై పోరు తప్పదని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు మహిపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ యాదగిరి, సీనియర్ నాయకులు గిరి కత్తుల, వెంకన్న,బాలు నాయక్, శ్రీధర్, మహేందర్, వంశీ తో పాటు కాలనీవాసులు ప్రజలు పాల్గొన్నారు.



# మాజీ మంత్రి హరీశ్ రావుకు పరామర్శ

**దౌల్తాబాద్ నవంబర్ 02(ప్రజాస్వరం)**

సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావు తండ్రి తన్నీరు సత్యనారాయణ రావు ఇటీవల మృతి చెందిన విషయం తెలుసుకొని హైదరాబాద్ కోకాపేటలో క్రిస్ విల్లాలోని వారి నివాసంలో ఆదివారం పరామర్శించడం జరిగిందని సోషల్ రిఫార్మేషన్ ఫౌండేషన్ అధ్యక్షులు, సామాజిక ప్రజా సేవకురాలు మహమ్మద్ సుల్తాన ఉమర్ తెలిపారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కేఆర్ భీమసేన, జాతీయ మాల మహానాడు రాష్ట్ర నాయకులు తుమ్మ శ్రీనివాస్ లతో కలిసి వారిని పరామర్శించారు. అనంతరం సత్యనారాయణ రావు చిత్రపటానికి పూలమాలతో నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సత్యనారాయణ రావు అకాల మృతి పట్ల చింతిస్తున్నామని, వారి మృతి పట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తూ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్ ఫౌండేషన్ ఉపాధ్యక్షులు మహమ్మద్ ముబాషీర్, ప్రధాన కార్యదర్శి జర్నలిస్ట్ పుట్టరాజు, కోశాధికారి మహమ్మద్ ఉమర్, మహమ్మద్ ఇంతియాజ్ తదితరులు పాల్గొన్నారు.



# అంబేద్కర్ సిద్దాంతాలపై చైతన్యం కలిగిస్తున్న అఖిల రాజ్ ఫౌండేషన్

**దౌల్తాబాద్ నవంబర్ 02 ప్రజాస్వరం**

డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ గారి సిద్దాంతాలను ప్రతి గ్రామానికి, ప్రతి మనసుకు చేర్చే కర్తవ్యబాధ్యతగా తీసుకుని పనిచేస్తున్న అఖిల రాజ్ ఫౌండేషన్ ప్రతినిధులు, ప్రముఖ మేధావి రచయిత, బహుముఖ ప్రజ్ఞశాలి, మన కాలపు మహానాయకుడు కత్తి పద్మారావు గారిని ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా అఖిల రాజ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు తౌడ సత్యనారాయణ, సభ్యులు నాగరాజు జాజుల, హైకోర్టు న్యాయవాదులు కమ్మరి రామకృష్ణ, రమాకాంత్, డాక్టర్ కిరణ్, అలాగే ఉస్మానియా విశ్వవిద్యాలయ విద్యార్థి నాయకులు కృష్ణ, రేణు, కార్తీక్, అరుణ్ కుమార్ లు పాల్గొన్నారు.కత్తి పద్మారావు గారితో సామాజిక న్యాయం, సమానత్వం, అంబేద్కర్ స్ఫూర్తితో యువతలో చైతన్యం కలిగించే అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఫౌండేషన్ తరఫున ఆయన సేవలను స్ఫూర్తిగా తీసుకుని అంబేద్కర్ ఆలోచనలను ప్రజల్లో విస్తృతంగా చేర్చేందుకు కృషి కొనసాగించనున్నట్లు తెలిపారు.

# ప్రభుత్వం భూముల పరిరక్షణ కై పోరాడాలి

- **డసిపిఐ జిల్లా జిల్లా కార్యదర్శి ఉమా మహేష్**

**జవహర్ నగర్, నవంబర్ 2; ప్రజాస్వరం:**

ప్రభుత్వ భూముల పరిరక్షణకై పోరాటం చేయాలని సిపిఐ మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ అన్నారు. ఆదివారం జవహర్ నగర్ లోని గిరీప్రసాద్ సిపిఐ కార్యాలయంలో కాప్రా మండల సిపిఐ మండల కార్యదర్శి యాదగిరి అధ్యక్షతన కాప్రా మండల సిపిఐ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో పాల్గొన్న సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ మాట్లాడుతూ.. గత బిఆర్ఎస్ పాలనలో వేలాది ఎకరాల ప్రభుత్వ భూమి కబ్జాలకు గురైందని కాంగ్రెస్ హయాంలోనైనా తగ్గుతుందని అనుకుంటే తగ్గకుండా అలాగే కొనసాగుతుందని కావున ప్రభుత్వ భూముల పరిరక్షణ కై సిపిఐ ఆధ్వర్యంలో పోరాటాలను నిర్వహించాలని అన్నారు.స్థానికంగా డంపింగ్ యార్డ నుండి నీటిని నివాసాల వైపు మల్లించడం వల్ల ప్రజలు అనారోగ్యానికి గురవుతారని కావున నీటి విడుదలను ఆపివెసెల పోరాటం చెయ్యాలని అన్నారు.మండలంలోని ఉన్న సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ స్పందిస్తూ ప్రజలలో తలలో నాలుకల ఉండాలని పిలుపునిచ్చారు. జిల్లా కార్యవర్గ సభ్యులు శంకర్ మాట్లాడుతు కాప్రా మండలంలో సిపిఐ పార్టీని బలోపేతం కోసం సిపిఐ కార్యకర్తలు కృషి చెయ్యాలని అన్నారు,ప్రభుత్వ భూములు పరిరక్షణ,బీసీ సమస్యలు,అసంఘాటీత కార్మికుల కోసం నిత్యం పోరాడాలని అన్నారు.
ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నిర్మల్ నర్సింలు దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు సిలుముల మల్లేష్ ,జిల్లా గిరిజన సమైక్య ప్రధాన కార్యదర్శి వి స్వరూప నాయక్ ,మండల సహాయ కార్యదర్శి జి లక్ష్మీ నారాయణ, మహిళా సమైక్య మండల అధ్యక్ష కార్యదర్శులు కోదాసు జయమ్మ, కే కవిత,గిరి ప్రసాద్ నగర్ నూతన శాఖ కార్యదర్శి గా కొండ సత్యం సాగర్ ,సహాయ కార్యదర్శిలు శ్యామల, లత, బి.నాని (సురేష్)నూతన కమిటీగా ఎన్నుకోవడం జరిగింది సిపిఐ నాయకులు గంగారం. కె కురుమయ్య సూర్యం సురేందర్ పి కురుమయ్య తదితరులు పాల్గొన్నారు.






# నింగిలోకి ఎల్వీఎమ్3 రాకెట్

- **దేశంలోనే అత్యంత బరువైన కమ్యూనికేషన్ ఉపగ్రహం CMS-03 ప్రయోగం సక్సెస్**
- **సుమారు 4400 కిలోల బరువున్న ఉపగ్రహాన్ని మోసుకెళ్లిన LVM3**
- **భారత్, సముద్ర ప్రాంతాలకు కమ్యూనికేషన్ సేవలు అందించనున్న CMS-03**

**హైదరాబాద్, ప్రజాస్వరం**

భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) ఖాతాలో మరో అద్భుత విజయం చేరింది. ఇస్రో ప్రయోగించిన అత్యంత బరువైన కమ్యూనికేషన్ ఉపగ్రహం CMS03ను మోసుకెళ్లిన LVM3M5 రాకెట్ విజయవంతంగా నింగిలోకి దూసుకెళ్లింది. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీహరికోటలో ఉన్న సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్ (షార్) నుంచి నేడు (నవంబర్ 2) ఈ ప్రయోగం సజావుగా జరిగింది. చారిత్రాత్మక చంద్రయాన్3 మిషన్‌ను విజయవంతం చేసిన LVM3 రాకెట్ సిరీస్‌లోనే ఈ ప్రయోగం చేపట్టడం విశేషం. CMS03 ఉపగ్రహం బరువు సుమారు 4400 కిలోలు. భారత భూభాగం నుంచి జియోసింక్రోనస్ ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్‌లోకి (GTO) ప్రయోగించిన అత్యంత బరువైన కమ్యూనికేషన్ ఉపగ్రహం ఇదే కావడం గమనార్హం. ఈ మల్టీబ్యాండ్ కమ్యూనికేషన్ ఉపగ్రహం ద్వారా భారత దేశంతో పాటు విస్తారమైన సముద్ర ప్రాంతాలలో కమ్యూనికేషన్ సేవలను మరింత మెరుగుపరచనున్నారు. ఈ ప్రయోగం దేశీయ టెలికమ్యూనికేషన్, బ్రాడ్‌కాస్టింగ్ రంగాలకు గొప్ప ఊతాన్ని ఇవ్వనుంది. ఈ ప్రయోగానికి ఇస్రో శాస్త్రవేత్తలు పక్కా ప్రణాళికతో సిద్ధమయ్యారు. రాకెట్, ఉపగ్రహం అనుసంధాన ప్రక్రియను పూర్తి చేసి, అక్టోబర్ 26నే దానిని ప్రయోగ వేదికపైకి తరలించారు. ప్రయోగానికి ముందు అన్ని దశల పరీక్షలను విజయవంతంగా పూర్తిచేసి, నిర్దేశిత సమయంలో రాకెట్‌ను నింగిలోకి పంపారు. చంద్రయాన్3 తర్వాత LVM3 రాకెట్ మరోసారి తన సత్తాను నిరూపించుకోవడంతో ఇస్రో శాస్త్రవేత్తలపై ప్రశంసల వర్షం కురుస్తోంది.



# కారు షెడ్డుకు పోయింది

- **బిల్లా రంగాలు ఆటో ఎక్కారు**
- **బోరబండలో సీఎం రేవంత్ కార్నర్ మీటింగ్**

**హైదరాబాద్, నవంబర్ ప్రజాస్వరం:**

జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ప్రచారంలో రెండోరోజు సీఎం రేవంత్ రెడ్డి పాల్గొని ప్రచారం చేపట్టారు. ఈసందర్భంగా అభివృద్ధి తదితర అంశాలతో పాటు బీఆర్ఎస్‌పై విమర్శలు గుప్పించారు. బోరబండలో నిర్వహించిన కార్నర్ మీటింగ్ లో మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీపై ఘాటైన వ్యాఖ్యలు చేశారు. అజారుద్దీన్ ను మంత్రి చేసి మాట నిలబెట్టుకున్నానని అన్నారు. కారు షెడ్డుకు పోయింది, బిల్లా రంగాలు ఆటోల్లో తిరుగుతున్నారని ఎద్దేవా చేశారు. పీజేఆర్ చనిపోతే ఏకగ్రీవానికి బీజేపీ, బీఆర్ఎస్ ఎందుకు సహకరించలేదని ప్రశ్నించారు. ఈ దుష్ట సంస్కృతికి తెర లేపిందే బీఆర్ఎస్ కాదా అని ధ్వజమెత్తారు. ఎమ్మెల్యే చనిపోతే ఎన్నికలు తీసుకొచ్చిన కసాయే కెసిఆర్ అని అన్నారు. బీఆర్ఎస్ ఈ ఎన్నికల్లో సెంటిమెంట్ రాజేయాలని చూస్తోందని అన్నారు. పదేళ్లు బీఆర్ఎస్ వ్యక్తి ఇక్కడ ఎమ్మెల్యేగా ఉన్నా సమస్యలు ఎందుకు పరిష్కారం కాలేదో ఆలోచించండని సీఎం రేవంత్ అన్నారు. తాడు బొంగరం లేని బీజేపీ ఇక్కడ అభివృద్ధి చేస్తామని అంటోందని ఎద్దేవా చేశారు. బోరబండలో అడిగినోళ్లందరికి రేషన్ కార్డులు ఇచ్చామని.. ఆడబిడ్డలకు ఫ్రీ బస్సు ఇస్తే బీఆర్ఎస్ కు కడుపు మండుతోందని.. ఆడబిడ్డలు పైసా లేకున్నా బస్సుల్లో ప్రయాణిస్తున్నారని అన్నారు సీఎం రేవంత్. 2014లో బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే.. ఐదేళ్లు మహిళా మంత్రి లేదని.. తాము అధికారంలోకి రాగానే ఇద్దరు మహిళలను మంత్రులను చేశామని అన్నారు సీఎం రేవంత్. మాగంటి గోపినాథ్ ఎప్పుడైనా అసెంబ్లీలో ప్రజాసమస్యలు ప్రస్తావించారా అని అన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో సమస్యలు పరిష్కారం కావాలంటే నవీన్ యాదవ్ ను గెలిపించాలని అన్నారు సీఎం రేవంత్. సిఎం వెంట ప్రచారంలో నవీన్ యాదవ్, మంత్రి అజారుద్దీన్ ఉన్నారు.





# నవీన్ యాదవ్ గెలుపే లక్ష్యంగా ప్రచారం

- **అలియాబాద్ మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు తుంకి రమేష్**

**శామీర్ పేట నవంబర్ 2(ప్రజస్వరం)**

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్యాదవ్ గెలుపు లక్ష్యంగా జోరుగా ప్రచారం నిర్వహిస్తున్నారు. ఆదివారం ఈ ఎన్నికలకు మేడ్చల్ జిల్లా అలియాబాద్ మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు తుంకి రమేష్ రహమత్ నగర్ డివిజన్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మేడ్చల్ నియోజకవర్గం ఇన్చార్జ్ తోటకూర వజ్రేష్యాదవ్ ఆద్వర్యంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపించాలని కోరుతు ఇంటింటికి తిరిగి ప్రచారం చేశారు. రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తో కలిసి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీలను పక్కాగా అమలుచేశామని కాంగ్రెస్ అభ్యర్థికే తమ ఓటు వేసి గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మార్కెట్ కమిటి చైర్మన్ బొమ్మలపల్లి నర్సిహా యాదవ్, జిల్లా ఆర్టిఎ మెంబర్ జైపాల్ రెడ్డి, రాష్ట్ర హాజ్ కమిటి మెంబర్ ముజుబుద్దిన్, కాంగ్రెస్ నాయకులు భూమిరెడ్డి, నవీన్ రెడ్డి, ఊరడి వెంకటేష్, తుంకి లక్ష్మయ్య, కొమ్ము వినోద్, మునిగొండ నవీన్, పిట్ల నర్సింలు, తదితరులు పాల్గొన్నారు.



# లక్ష్మీ నరసింహ స్వామిని దర్శించుకున్న మైనంపల్లి హన్మంతరావు

- **మైనంపల్లి రోహిత్ జన్మదినం సందర్భంగా నాచారం దేవస్థానంలో ప్రత్యేక పూజలు**

**వర్గల్ సెప్టెంబర్ 02 (ప్రజాస్వరం).**

మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ జన్మదినం సందర్భంగా వర్గల్ మండలం నాచారం లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించిన మైనంపల్లి హన్మంతరావు ,నాచారం లక్ష్మీనరసింహస్వామి దేవాలయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నాచారం దేవాలయం అభివృద్ధి చెందటానికి కృషి చేస్తానని మైనంపల్లి హన్మంతరావు హామీ ఇచ్చారు..ఈ కార్యక్రమంలో మెదక్ డిసిసి ఆంజనేయులు గౌడ్ మెదక్ జిల్లా గ్రంధాలయ చైర్మెన్ సుహాసిని రెడ్డి ,కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు బండారు శ్రీకాంత్ రావు,చిట్కుల మహిపాల్ రెడ్డి ,నాయిని యాదగిరి,సిద్దిపేట జిల్లా యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు అనిల్ రెడ్డి, సిద్దిపేట జిల్లా ఎస్ సి సెల్ అధక్షుడు విజయ్ కుమార్,బంగారు రెడ్డి,హన్మంత రెడ్డి,శశిభూషణ్ రెడ్డి,గడ్డి వెంకటేష్ యాదవ్,నాచారం డైరెక్టర్లు సంతోష్ పంతులు,శ్రీనివాస్,వర్గల్ మండల కాంగ్రెస్ నాయకులు చెన్నయ్య,సుల్తాన్ భాయ్, బిట్ల నవీన్,పిట్ల కృష్ణ,వెంకటేష్,శ్రీకాంత్,మహబూబ్,సాయికుమార్ ,భాస్కర్,భాను,నితిన్ రెడ్డి,నవీన్ తదితరులు పాల్గొన్నారు

# విద్యుత్ వినియోగదారుల దినోత్సవాన్ని సద్వినియోగం చేసుకోవాలి:ఏడిఈ అశోక్ రావు

- **నేడు శామీర్ పేట ఏడిఈ కార్యాలయం వద్ద విద్యుత్తు వినియోగదారుల దినోత్సవం**

**శామీర్ పేట నవంబర్ 1(ప్రజస్వరం)**

విద్యుత్ వినియోగదారుల దినోత్సవాన్ని శామీర్ పేట విద్యుత్తుశాఖ సబ్ డివిజన్ కార్యాలయం వద్ద నిర్వహించడం జరుగుతుందని శామీర్ పేట ఏడిఈ అశోక్ రావు, శామీ పేట అసిస్టెంట్ ఇంజనీర్ రాఘవేంద్ర రావు, అలియాబాద్ అసిస్టెంట్ ఇంజనీర్ వెంకటనారాయణ ఆదివారం వేరు వేరు ప్రకటనలో పేర్కొన్నారు. కాబట్టి శామీర్ పేట, మూడుచింతలపల్లి మండలాలకు చెందిన విద్యుత్ వినియోగదారులు తమ సేవల సమస్యలు, ఫిర్యాదులు అలాగే సూచనలను తెలుపాలని అధికారులు కోరారు. విద్యుత్ శాఖ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ కట్టుబడి ఉందని, అందరికీ మెరుగైన మరియు సమర్థవంతమైన సేవలు అందించే దిశగా నిరంతరం కృషి చేస్తోందని విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## డీఎంకే అఖిలపక్ష సమావేశానికి విజయ్ డుమ్మా...

# రాజకీయ నాటకం అంటూ ఫైర్

- **డీఎంకే అఖిలపక్ష సమావేశాన్ని బహిష్కరించిన విజయ్**
- **ఓటర్ల జాబితా సవరణ రాజ్యాంగ విరుద్ధమని ఆరోపణ**
- **బీహార్ తరహాలో మైనారిటీ ఓట్లను తొలగించే ప్రమాదం ఉందన్న విజయ్**
- **అవినీతి నుంచి దృష్టి మళ్లించేందుకే డీఎంకే నాటకమని విమర్శ**
- **కేరళలా అసెంబ్లీలో తీర్మానం ఎందుకు చేయలేదని ప్రశ్న**
- **ఓటర్ల హక్కుల కోసం రాష్ట్రవ్యాప్త ప్రచారం చేపడతామని ప్రకటన**

**హైదరాబాద్, ప్రజాస్వరం**



తమిళనాడులో అధికార డీఎంకే పార్టీకి, నటుడు, తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధ్యక్షుడు విజయ్‌కు మధ్య రాజకీయ వేడి రాజుకుంది. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (SIR)పై చర్చించేందుకు డీఎంకే ప్రభుత్వం ఆదివారం ఏర్పాటు చేసిన అఖిలపక్ష సమావేశాన్ని విజయ్ బహిష్కరించారు. ఈసీ చేపట్టిన ఈ సవరణ ప్రక్రియ పూర్తిగా "రాజ్యాంగ విరుద్ధం, రాజకీయ ప్రేరేపితం, ప్రజాస్వామ్యానికి పెను ముప్పు" అని ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

ఈ మేరకు విజయ్ ఒక ఘాటైన ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుతం జరుగుతున్న ఓటర్ల జాబితా సవరణ వల్ల గతంలో బీహార్‌లో జరిగినట్లే తమిళనాడులో కూడా లక్షలాది మంది మైనారిటీ ఓటర్లను జాబితా నుంచి తొలగించే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కేవలం 30 రోజుల వ్యవధిలో రాష్ట్రంలోని 6.36 కోట్ల మంది ఓటర్ల వివరాలను ఎలా ధృవీకరిస్తారని ఎన్నికల సంఘాన్ని ప్రశ్నించారు. ఈసీ చర్యల్లో పారదర్శకత, నిష్పక్షపాత వైఖరి లోపించాయని, ఇంతటి హడావుడి ప్రక్రియ ప్రజల ప్రాథమిక ప్రజాస్వామ్య హక్కులను కాలరాయడమేనని అన్నారు. డీఎంకే ప్రభుత్వంపై కూడా విజయ్ తీవ్ర విమర్శలు చేశారు. వారిపై ఉన్న అవినీతి ఆరోపణల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే డీఎంకే ఈ అఖిలపక్ష సమావేశ నాటకానికి తెరలేపిందని ఆరోపించారు. "ఈసీ నిర్ణయాన్ని నిజంగా వ్యతిరేకిస్తే, కేరళ అసెంబ్లీలో తీర్మానం చేసినట్లుగా డీఎంకే ప్రభుత్వం ఎందుకు చేయలేదు? ఈ సమావేశం ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు ఆడుతున్న ఓ మోసపూరిత రాజకీయ నాటకం" అని ఆయన అభివర్ణించారు. పారదర్శకమైన ఓటర్ల జాబితా కోసం విజయ్ ఏడు కీలక సూచనలను కూడా ప్రతిపాదించారు. జాబితాలోని తప్పులను సరిదిద్దడం, నకిలీ ఓట్లను తొలగించడం, అర్హులైన ప్రతి ఒక్కరినీ చేర్చడం, వయస్సు చిరునామా ధృవీకరణకు ఆధార్ కార్డును అంగీకరించడం, తుది జాబితాను రాజకీయ పార్టీలకు, ప్రజలకు డిజిటల్‌గా అందుబాటులో ఉంచడం వంటివి ఇందులో ఉన్నాయి. ఈ ప్రక్రియలో అవకతవకలు జరగకుండా స్థానిక ప్రతినిధులు, స్వతంత్ర పరిశీలకులను భాగస్వాములను చేయాలని ఈసీని కోరారు. ప్రజల ప్రజాస్వామ్య హక్కులను కాపాడేందుకు తమ పార్టీ కట్టుబడి ఉందని స్పష్టం చేసిన విజయ్, నిజమైన ఓటర్లను తొలగించకుండా చూసేందుకు రాష్ట్రవ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు చేపడతామని, ప్రత్యేక శిబిరాలను పర్యవేక్షిస్తామని ప్రకటించారు. "ప్రజాస్వామ్యం, హక్కులు, న్యాయం కోసం టీవీకే ఎల్లప్పుడూ ప్రజల పక్షాన నిలుస్తుంది" అని ఆయన పునరుద్ఘాటించారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఓటర్ల జాబితా సవరణను దుర్వినియోగం చేసే అవకాశం ఉందని తమిళనాడులోని పలు ఇతర రాజకీయ పార్టీలు కూడా ఆందోళన వ్యక్తం చేస్తున్న తరుణంలో విజయ్ విమర్శలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

# జాగృతి టీచర్స్ ఫెడరేషన్ నూతన కమిటీని ప్రకటించిన కవిత

- **అధ్యక్షుడిగా మోరం వీరభద్రరావు నియామకం**
- **ప్రధాన కార్యదర్శిగా జాడి శ్రీనివాస్‌కు బాధ్యతలు**

**హైదరాబాద్, ప్రజాస్వరం**

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సంస్థాగత నియామకాలపై దృష్టి సారించారు. జాగృతి అనుబంధ విభాగమైన "జాగృతి టీచర్స్ ఫెడరేషన్" నూతన కార్యవర్గాన్ని ఆమె ప్రకటించారు. ఈ మేరకు జాగృతి అధికారిక ఎక్స్ ఖాతా ద్వారా వివరాలను వెల్లడించారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా మోరం వీరభద్రరావును, ఉపాధ్యక్షుడిగా బుర్ర రమేష్ గౌడ్‌ను నియమించారు. ప్రధాన కార్యదర్శిగా జాడి శ్రీనివాస్, కోశాధికారిగా ఘనపురం దేవేందర్ బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ నియామకాలన్నీ తక్షణమే అమల్లోకి వస్తాయని కవిత స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెలంగాణ సమాజ అభ్యున్నతి, నవ తెలంగాణ నిర్మాణ లక్ష్యంతో తెలంగాణ జాగృతి పని చేస్తోందని తెలిపారు. కొత్తగా నియమితులైన బాధ్యులు విద్యారంగ అభివృద్ధికి, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి శక్తివంచన లేకుండా కృషి చేయాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలో విద్యా ప్రమాణాల పెంపునకు ఫెడరేషన్ చురుకైన పాత్ర పోషించాలని ఆమె సూచించారు.



# ముమ్మాటికీ ఇది అక్రమ అరెస్టు

- **జోగి రమేశ్ అరెస్టుపై జగన్ స్పందన**
- **నకిలీ మద్యం కేసులో మాజీ మంత్రి జోగి రమేశ్ అరెస్ట్**
- **చంద్రబాబుపై ధ్వజమెత్తిన జగన్**
- **ప్రజల దృష్టి మళ్లించేందుకే కుట్రలకు పాల్పడుతున్నారంటూ విమర్శలు**

**అమరావతి, ప్రజాస్వరం**

సిట్ విచారణ ఒక బూటకం అని ఆరోపణ నకిలీ మద్యం కేసులో మాజీ మంత్రి, వైసీపీ నేత జోగి రమేశ్ ను అరెస్టు చేయడంపై ఆ పార్టీ అధినేత జగన్ తీవ్రంగా స్పందించారు. ఇది ముమ్మాటికీ అక్రమ అరెస్టు అని పేర్కొంటూ, ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. నకిలీ మద్యం కుంభకోణంలో అడ్డంగా దొరికిపోయి, దాని నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే నిస్సిగ్గుగా ఇలాంటి కుట్రలకు పాల్పడుతున్నారని ఆయన ఆరోపించారు. చంద్రబాబు గారూ... మీ నకిలీ మద్యం ఫ్యాక్టరీలు బయటపడ్డ వ్యవహారంలో అడ్డంగా మీరు దొరికిపోయి, దీని నుంచి తప్పించుకోవడానికి నిస్సిగ్గుగా కుట్రలకు పాల్పడుతూ మా పార్టీకి చెందిన బీసీ నాయకుడు, మాజీ మంత్రి జోగిరమేశ్ ను అన్యాయంగా అరెస్టు చేశారు. ముమ్మాటికీ ఇది అక్రమ అరెస్టు. జోగి రమేశ్ అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నాను. గత 18 నెలలుగా ప్రభుత్వం మీది, పాలన మీది. పట్టుబడ్డ నకిలీ మద్యం మీ హయాంలోనిది. పట్టుబడ్డవారిలో మీ పార్టీ నుంచి ఎన్నికల్లో పోటీచేసిన ఎమ్మెల్యే అభ్యర్థి మొదలు, మీతోనూ, మీ కొడుకుతోనూ, మీ మంత్రులతోనూ, మీ ఎమ్మెల్యేలతోనూ, అత్యంత సన్నిహిత సంబంధాలు కలిగినవారే ఉన్నారు. మీరు తయారు చేసిన మీ నకిలీ మద్యాన్ని అంతా అమ్మేది, మీరు తీసుకు వచ్చిన మీ ప్రైవేటు లిక్కర్ షాపుల్లోనే, మీ కార్యకర్తలు, నాయకులు నడిపే బెల్టుషాపుల్లోనే, పర్మిట్ రూముల్లోనే. మరి తయారీ మీది, చేసిన వారు మీవారు, అమ్మేదీ మీరే, కాని బురదజల్లేది, అక్రమ అరెస్టులు చేసేది మాత్రం మావాళ్లని. నిన్న కాశీబుగ్గ ఆలయంలో తొక్కిసలాటకు కారణమైన ప్రభుత్వ వైఫల్యాల నుంచి దృష్టిమళ్లించడానికి, మొంథా తుపాను కారణంగా కుదేలైన రైతు గోడును పక్కదోవపట్టించడానికి ఈ అక్రమ అరెస్టుకు పాల్పడి, దుర్మార్గానికి ఒడిగట్టారు. నకిలీ మద్యం వ్యవహారంపై సీబీఐ విచారణ జరిపించాలంటూ జోగి రమేశ్ హైకోర్టులో పిటిషన్ వేసిన మరుసటిరోజే అరెస్టుకు దిగారంటే చంద్రబాబుగారూ.. మీరు ఎంతగా భయపడుతున్నారో అర్థం అవుతోంది. నకిలీ మద్యం వ్యవహారంలో మీ ప్రమేయం, మీ మనుషుల ప్రమేయం లేకపోతే సీబీఐ చేత విచారణకు భయమెందుకు చంద్రబాబు గారూ? ఎందుకు వెనకడుగు వేస్తున్నారు? మీ జేబులో ఉన్న సిట్ మీరు ఏం చెబితే అది చేస్తుంది. మీరు సిట్ అంటే సిట్.. స్టాండ్ అంటే స్టాండ్. మీ మాఫియా వ్యవహారాల మీద మీరే విచారణ చేయించడం హాస్యాస్పదం కాదా? ఇలాంటి రాక్షస పాలనలో మీ నుంచి ఏమి ఆశించగలం?" అంటూ జగన్ ట్వీట్ చేశారు.




# నకిలీ మద్యం కేసులో జోగి రమేశ్ అరెస్ట్

- **తీవ్రంగా స్పందించిన వైసీపీ అగ్రనేతలు**
- **జోగి రమేశ్ ను దురుద్దేశంతో ఇరికించారని వారు ఆరోపణ**
- **ప్రభుత్వ వైఫల్యాలు కప్పిపుచ్చడానికే అరెస్ట్ అని విమర్శలు**

**అమరావతి, ప్రజాస్వరం**

మాజీ మంత్రి, వైసీపీ నేత జోగి రమేశ్ అరెస్టుపై ఆ పార్టీ నాయకులు తీవ్రంగా స్పందించారు. ఇది పూర్తిగా అక్రమ అరెస్ట్ అని, కేవలం రాజకీయ కక్ష సాధింపు చర్యలో భాగమేనని మండిపడ్డారు. ఈ మేరకు వైసీపీ నేతలు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, మేరుగు నాగార్జున, పేర్ని నాని, అంబటి రాంబాబు, కురసాల కన్నబాబు, గడికోట శ్రీకాంత్‌రెడ్డి, మార్గాని భరత్, టీజేఆర్ సుధాకర్‌బాబు ఓ సంయుక్త ప్రకటన విడుదల చేశారు. కల్తీ మద్యం కేసులో జోగి రమేశ్ ను దురుద్దేశంతో ఇరికించారని వారు ఆరోపించారు. కస్టడీలో ఉన్న ఏ1 నిందితుడు జనార్దన్‌రావుతో బలవంతంగా జోగి రమేశ్ పేరు చెప్పించారని విమర్శించారు. ఈ ఆరోపణలపై జోగి రమేశ్ సవాల్ విసిరి, కనకదుర్గమ్మ ఆలయంలో ప్రమాణం చేసినా టీడీపీ నేతలు స్పందించలేదని గుర్తుచేశారు. వైసీపీని, జోగి రమేశ్ కుటుంబాన్ని ఇబ్బంది పెట్టడమే లక్ష్యంగా ప్రభుత్వం తప్పుడు విచారణలు జరుపుతోందని, లేని లిక్కర్ స్కామ్‌లను సృష్టిస్తోందని వారు ఆరోపించారు. రెండు కీలక ఘటనల నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకే ప్రభుత్వం ఈ అరెస్టుల నాటకానికి తెరలేపిందని వైసీపీ నేతలు విమర్శించారు. కాశీబుగ్గ వెంకటేశ్వరస్వామి ఆలయంలో జరిగిన తొక్కిసలాట, మొంథా తుపాను సహాయక చర్యల్లో ప్రభుత్వ వైఫల్యం వంటి అంశాలను కప్పిపుచ్చడానికే ఈ అరెస్ట్ చేశారని దుయ్యబట్టారు. కల్తీ మద్యం తయారుచేస్తూ టీడీపీ నేతలు దొరికిపోతే, ఆ నెపాన్ని వైసీపీపైకి నెట్టేందుకు కుట్ర పన్నుతున్నారని పేర్కొన్నారు.

ఈ కేసుపై సీబీఐ దర్యాప్తు జరపాలని జోగి రమేశ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారని, అది విచారణకు రాకముందే ఆయన్ను అరెస్ట్ చేయడం ప్రభుత్వ దురుద్దేశానికి నిదర్శనమని అన్నారు. కల్తీ మద్యం కేసులో పక్కా ఆధారాలున్న టీడీపీ నాయకులను వదిలేసి, కేవలం కక్ష సాధింపు కోసం జోగి రమేశ్ ను అరెస్టు చేశారని మండిపడ్డారు. ప్రభుత్వ ఈ దమనకాండను ప్రజాక్షేత్రంలో ఎండగడతామని వైసీపీ నేతలు హెచ్చరించారు.





# లండన్ చేరుకున్న సీఎం చంద్రబాబు దంపతులు

- **తెలుగు వారి ఆత్మీయ స్వాగతం.**
- **లండన్‌లో తెలుగు కుటుంబాల నుంచి ఘన స్వాగతం**
- **నారా భువనేశ్వరికి ఒకే వేదికపై రెండు ప్రతిష్ఠాత్మక పురస్కారాలు**
- **సామాజిక సేవకుగాను 'డిస్టింగ్విష్డ్ ఫెలోషిప్' అవార్డు**
- **హెరిటేజ్ ఫుడ్స్‌కు 'గోల్డెన్ పీకాక్' పురస్కారం**
- **ఎల్లుండి ఐఓడీ సంస్థ నుంచి అవార్డులు అందుకోనున్న భువనేశ్వరి**

**అమరావతి. ప్రజాస్వరం**

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆయన అర్ధాంగి నారా భువనేశ్వరి లండన్ చేరుకున్నారు. వ్యక్తిగత పర్యటన నిమిత్తం లండన్ వెళ్లిన చంద్రబాబు దంపతులకు విమానాశ్రయంలో తెలుగు కుటుంబాలు ఆత్మీయ స్వాగతం పలికాయి. ఈ సందర్భంగా చంద్రబాబు అక్కడి తెలుగువారితో ఆప్యాయంగా మాట్లాడి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.ఈ పర్యటనలో భాగంగా నారా భువనేశ్వరి రెండు ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ పురస్కారాలను అందుకోనున్నారు. లండన్‌కు చెందిన ప్రఖ్యాత ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డైరెక్టర్స్ (ఐఓడీ) సంస్థ ఈ అవార్డులను ప్రకటించింది. సామాజిక సేవా రంగంలో నారా భువనేశ్వరి అందిస్తున్న విశేష కృషికి గుర్తింపుగా 'డిస్టింగ్విష్డ్ ఫెలోషిప్' అవార్డును ఆమెకు ప్రదానం చేయనున్నారు.అదేవిధంగా, కార్పొరేట్ పాలనలో అత్యుత్తమ ప్రమాణాలను పాటించినందుకు గాను హెరిటేజ్ ఫుడ్స్ సంస్థకు 'గోల్డెన్ పీకాక్' అవార్డు లభించింది. హెరిటేజ్ ఫుడ్స్ అధినేతగా ఈ పురస్కారాన్ని కూడా నారా భువనేశ్వరి అందుకోనున్నారు. ఎల్లుండి జరగనున్న కార్యక్రమంలో ఆమె ఈ రెండు అవార్డులను స్వీకరిస్తారు.

# జోగి పాపం పండింది

- **మాజీ మంత్రి జోగి రమేశ్ అరెస్టుపై మంత్రి అనగాని రియాక్షన్**
- **నకిలీ మద్యం తయారు చేయించాడంటూ తీవ్ర ఆరోపణలు**
- **సూత్రధారి జోగి.. పాత్రధారి అద్దేపల్లి ముఠా అన్న మంత్రి**

**అమరావతి, ప్రజాస్వరం**



జగన్ పాలనలో నకిలీ మద్యంతో వేలాది మంది ప్రాణాలు తీశారని, వారి భార్యల మాంగళ్యాలు మంటగలిశాయని మంత్రి అనగాని సత్య ప్రసాద్ ఆరోపించారు. మాజీ మంత్రి జోగి రమేశ్ అరెస్టుపై మంత్రి స్పందిస్తూ.. జోగి పాపం పండిందని వ్యాఖ్యానించారు. నకిలీ మద్యం వ్యవహారంలో జోగి సూత్రధారి కాగా, పాత్రధారి అద్దేపల్లి జనార్ధన్ రావు ముఠా అని ఆరోపించారు. నకిలీ మద్యం తయారు చేయించి బెల్టు షాపులు, ప్రభుత్వ షాపుల్లో అమ్మించాడని జోగి రమేశ్ పై మండిపడ్డారు. జగన్ 'జే' బ్రాండ్ మద్యం వల్ల ఏపీలో లక్షలాదిమంది ఆరోగ్యాలు గుల్ల అయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. అగ్రిగోల్డ్ భూములు కబ్జా చేశారని మంత్రి ఆరోపించారు. ఆఫ్రికాకు పారిపోయే ముందు జనార్ధనరావు మాజీ మంత్రి జోగి రమేశ్ ఇంటికి ఎందుకు వెళ్లాడని మంత్రి సత్య ప్రసాద్ ప్రశ్నించారు. ఇందుకు సంబంధించిన సీసీటీవీ పుటేజ్ బయటకు వచ్చిన విషయాన్ని మంత్రి గుర్తుచేశారు. న్యాయస్థానాల్లో సీసీటీవీ పుటేజ్ కు విలువ వుంటుందిగాని జోగి రమేశ్ ప్రమాణాలు, ఒట్టుకు, సవాళ్లకు విలువ ఉండదని చెప్పారు. మాజీ మంత్రికి ఈ కనీస జ్ఞానం కూడా లేదని ఎద్దేవా చేశారు. సీసీటీవీ పుటేజీలో స్పష్టంగా కనిపిస్తున్నప్పటికీ ప్రమాణాలతో ప్రజలను వెర్రివాళ్లని చేయాలని జగన్ ముఠా భావిస్తోందని చెప్పారు. జోగి రమేశ్ ప్రలోభాలతోనే 2022 నుంచి నకిలీ మద్యం తయారీ ప్రారంభించానని అద్దేపల్లి వాంగ్మూలం ఇచ్చింది నిజం కాదా? అని ప్రశ్నించారు. అతడికి రూ.3 కోట్లు ఆశ పెట్టింది, బాల్యం నుంచి వారిద్దరు స్నేహితులనేది నిజం కాదా అని అడిగారు. ఇలాంటి నిజాలు ఎన్నో ఉన్నా జగన్ అతడిని పార్టీ నుంచి ఎందుకు సస్పెండ్ చేయలేదని నిలదీశారు. ఇద్దరూ తోడుదొంగలు కాబట్టే చర్యలు తీసుకోలేదన్నారు. తెలుగుదేశం పార్టీ నకిలీ మద్యం తయారీ, అమ్మకాలను సహించదు కాబట్టే జయచంద్రారెడ్డిని పార్టీ నుంచి సస్పెండ్ చేసి ప్రభుత్వం కేసు నమోదు చేసిందని చెప్పారు. జయచంద్రారెడ్డిని సస్పెండ్ చేసి టీడీపీ తన నిజాయితీని రుజువు చేసుకుందని మంత్రి సత్య ప్రసాద్ చెప్పారు.వైసీపీ మాత్రం జోగి రమేశ్ ను పార్టీ నుంచి సస్పెండ్ చేయకపోగా ప్రశ్నించిన వారిపైనే ఎదురుదాడి చేస్తోందని విమర్శించారు. నేరస్తులపై చర్య తీసుకోవడం కక్ష సాధింపు ఎలా అవుతుందని మంత్రి ఈ సందర్భంగా ప్రశ్నించారు. జోగి అరెస్టును కక్ష సాధింపు చర్య అంటూ జగన్ ముఠా చేసే కాకి గోలను రాష్ట్ర ప్రజలు నమ్మబోరని చెప్పారు. నేరస్తులకు కులాలు ఉండవని, వీరు కుల ద్రోహులు కూడా అవుతారని చెప్పారు. వేలాది పేదల ప్రాణాలు తీసిన నకిలీ మద్యం తయారీదారులను అరెస్టు చేసిన సిట్ అధికారులను ప్రజలు అభినందిస్తున్నారని మంత్రి అనగాని సత్య ప్రసాద్ అన్నారు.

## ఐపీఎల్ వేలం విదేశాల్లోనేనా?

**అమరావతి, ప్రజాస్వరం**

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2026 సీజన్‌కు సంబంధించిన మినీ వేలంపై కీలక సమాచారం బయటకు వచ్చింది. ముందుగా ఈ వేలాన్ని భారత్‌లోనే నిర్వహిస్తారని వార్తలు వచ్చినా, తాజాగా ఈ ప్రణాళికలో మార్పు చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. ఈసారి కూడా వేలాన్ని విదేశాల్లో, ముఖ్యంగా గల్ఫ్ దేశాల్లో నిర్వహించేందుకు బీసీసీఐ మొగ్గు చూపుతోంది.అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం, డిసెంబర్ 14న ఈ మినీ వేలం జరగనుంది. ఒకటి కంటే ఎక్కువ రోజులు అవసరమైతే డిసెంబర్ 13ని కూడా పరిశీలనలో ఉంచారు. (యూఏఈ)లోని అబుదాబి పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. దీంతో పాటు ఒమన్, ఖతార్ వంటి దేశాలను కూడా బీసీసీఐ పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఫ్రాంచైజీలకు ఇంకా అధికారికంగా నగరం పేరు చెప్పనప్పటికీ, గల్ఫ్‌లో నిర్వహణపై సూచనలు అందినట్లు తెలుస్తోంది.వాస్తవానికి ఈసారి వేలాన్నిస్వదేశంలోనేనిర్వహించాలనిబీసీసీఐ బలంగా భావించింది. ముంబై, బెంగళూరు నగరాలనుప్రాథమికంగాఎంచుకున్నప్పటికీ, అదేసమయంలోదేశవ్యాప్తంగాపండగలు,పెళ్లిళ్లసీజన్‌కావడంతోఅనువైనవేదికనుఖరారు చేయడంసవాలుగామారింది.

## రూ.15 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ఇస్తున్నాం: మంత్రి నారా లోకేశ్

**అమరావతి, ప్రజాస్వరం**



శ్రీకాకుళం జిల్లాలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. కాశీబుగ్గలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఏకాదశి పర్వదినం సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో 9 మంది భక్తులు దుర్మరణం చెందారు. ఈ దుర్ఘటనలో మరో 16 మందికి తీవ్ర గాయాలయ్యాయి. ఏకాదశి కావడంతో ఆలయానికి ఊహించని రీతిలో భక్తులు పోటెత్తడమే ఈ ప్రమాదానికి కారణంగా తెలుస్తోంది.విషాద వార్త తెలిసిన వెంటనే రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్, ఇతర మంత్రులతో కలిసి హుటాహుటిన కాశీబుగ్గకు చేరుకున్నారు. ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని పరిశీలించి, అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం పలాసలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు వెళ్లి చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించారు. వారికి అందుతున్న వైద్యం గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు మెరుగైన చికిత్స అందించాలని, అవసరమైతే మెరుగైన ఆసుపత్రికి తరలించాలని ఆదేశించారు. ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని బాధితులకు, వారి కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు.ఈ సందర్భంగా మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు మృతుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున రూ.15 లక్షల చొప్పున ఆర్థిక సాయం అందిస్తున్నట్లు ప్రకటించారు. తీవ్రంగా గాయపడిన వారికి రూ.3 లక్షలు అందజేస్తామన్నారు. తక్షణ ఖర్చుల కోసం మృతుల కుటుంబాలకు రూ.10 వేల చొప్పున అందజేశామని వివరించారు.ఈ ఘటనపై ప్రధాని కార్యాలయానికి కూడా సమాచారం అందించామని, వారు కూడా స్పందించి మృతుల కుటుంబాలకు రూ.2 లక్షలు, క్షతగాత్రులకు రూ.50 వేల చొప్పున సాయం ప్రకటించారని లోకేశ్ తెలిపారు. మృతుల్లో ముగ్గురు తెలుగుదేశం పార్టీ సభ్యులు ఉన్నారని, పార్టీ ప్రమాద బీమా పథకం ద్వారా వారి కుటుంబాలకు అదనంగా రూ.5 లక్షల చొప్పున సాయం అందిస్తామని వెల్లడించారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి, భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు.



## శ్రీవారి సేవలో నారా రోహిత్, శిరీష

**అమరావతి, ప్రజాస్వరం**

కొత్త దంపతులు నారా రోహిత్, శిరీష ఆదివారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఆదివారం వీఐపీ ప్రారంభ విరామ దర్శన సమయంలో కుటుంబ సభ్యులతో కలిసి నారా రోహిత్ దంపతులు స్వామివారి సేవలో పాల్గొన్నారు. గత నెల 30న నారా రోహిత్, శిరీషల వివాహం జరిగిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే కొత్త దంపతులు కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం తిరుమల వెంకన్న దర్శనానికి వచ్చారు. టీటీడీ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. స్వామి వారి దర్శనం తర్వాత రంగనాయకుల మండపంలో నారా రోహిత్ దంపతులకు ఆలయ పండితులు వేదాశీర్వచనం చేసి తీర్థప్రసాదాలను అందజేశారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY PURAM MAHESHWAR PRINTED AT HARI HARA ART PRINTERS, H.NO. 6-185, TOOPRAN, DIST. MEDAK, TELANGANA-502336. AND PUBLISHED AT H.NO. 4-50/18, KALLAKAL, VILL-KALLAKAL,(PO), KALLAKAL, (M) MANOHARABAD, DIST, MEDAK, TELANGANA-502336,
EDITOR : PURAM MAHESHWAR. RNI NO : TELTEL/2006/17154, CELL : 8008609999